తెలుగు దినపత్రిక
https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 147

బుధవారం | 29, అక్టోబర్ 2025

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## ఎఐ టెక్నాలజీతో అప్రమత్తం

- డీప్‌ఫేక్ మోసాలతో జాగ్రత్త
- సేఫ్‌వర్డ్ టెక్నిక్ సూచించిన సిపి సజ్జన్నార్



హైదరాబాద్,అక్టోబర్28(అక్షరగళం): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పుడు మన జీవితంలో కీలకంగా మారింది. ఈ టెక్నాలజీ ఎంత శక్తివంతమైందో, అంతే ప్రమాదకరంగా కూడా మారుతోంది. ముఖ్యంగా డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా మన ముఖం, మన గొంతును కూడా కచ్చితంగా నకిలీగా సృష్టించడం సాధ్యమైంది. ఇప్పుడు ఎవరికైనా మీ వీడియో లేదా వాయి స్‌ను వాడి, మీరు మాట్లాడుతున్నట్టుగా నకిలీ సందేశాలు పంపడం, వీడియోలు మిగతా..2లో



## తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు నీటి తరలింపు

- 80టీఎంసీల నీటిని తరలించేందుకు ప్రణాళికలు
- చేపట్టాల్సిన ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్,అక్టోబర్28 (అక్షరగళం): తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80టీఎంసీల నీటిని తరలించేం దుకు.. ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగు నీరు అందించాలని మార్గనిర్దేశం చేశారు. తుమ్మిడిహట్టి దగ్గర పాత పనులను ఉపయోగించు కుంటూ.. అంచనాలను తయారు చేయాలని సీఎం సూచించారు. సుందిళ్లకి రిపేర్ చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మిగతా..2లో

# సినీ కార్మికులకు ప్రభుత్వం అండ




- టిక్కెట్ల రేట్లలో కార్మిక సంక్షేమం కోసం 20శాతం
- ఆరోగ్యశ్రీ, ఇళ్ల స్థలాలు, పిల్లలకు ప్రత్యేక స్కూలు
- ఆస్కార్ స్థాయికి సినీ పరిశ్రమను తీసుకెళ్లిన ఘనత మీదే
- సినీకార్మిక సంఘం సన్మాన సభలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్28 (అక్షరగళం): ప్రపంచ సినీ పరిశ్రమకు హైదరాబాద్ నగరం వేదిక కావాలనేది తన సంకల్పమని మిగతా..2లో




## "ఏరో-ఇంజిన్" రాజధానిగా తెలంగాణ

- 2030 నాటికి తీర్చిదిద్దేలా సమగ్ర "రోడ్ మ్యాప్"
- ఇక్కడి నుంచే ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలకు "ఏరో ఇంజిన్ రొటేటివ్ కాంపోనెంట్స్"
- రూ.425 కోట్ల పెట్టుబడి... 500 మందికి కొత్తగా ఉద్యోగాలు
- ఆదిభట్ల "న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ" ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,అక్టోబర్28 (అక్షరగళం): 2030 నాటికి తెలంగాణను దేశ "ఏరో-ఇంజిన్" రాజధానిగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని అని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ ఏరో సంస్థలు రాష్ట్రంలో కొత్తగా పెట్టుబడులు పెట్టేలా సమగ్ర "రోడ్ మ్యాప్"ను సిద్ధం చేస్తున్నామన్నారు. "టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్", "సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్" సంయుక్తంగా రూ.425 కోట్ల పెట్టుబడితో ఆదిభట్లలో ఏర్పాటు చేసిన "ఏరో ఇంజిన్ రొటేటివ్ కాంపోనెంట్స్" న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని మంగళవారం హైటెక్ సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. గ్లోబల్ "ఏరోస్పేస్-డిఫెన్స్ - స్పేస్" హబ్ గా తెలంగాణ ను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. హైదరాబాద్ అంటే కేవలం "సిటీ ఆఫ్ పెరల్స్" మాత్రమే కాదని, ప్రొపల్షన్, ప్రెసిషన్, ప్రోగ్రెస్ నగరంగా మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగాల ఎగుమతులు 2023-24లో రూ.15,900 కోట్లుఉండగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి 9 నెలల్లోనే ?30,742 కోట్లకు పెరిగాయన్నారు.ఇవి కేవలం అంకెలు మాత్రమే కాదని, తమ ప్రభుత్వ హయాంలో ఈ రంగం సాధించిన వృద్ధి రేటుకు నిదర్శనమన్నారు. ఈ "న్యూమాన్యుఫ్యాక్చరింగ్‌ఫెసిలిటీ"లో ఎయిర్ బస్, బోయింగ్ సంస్థలు లీప్ ఇంజిన్ల తయారీలో వినియోగించే బేరింగ్ హౌసింగ్ (స్టేషనరీ కాంపోనెంట్),లో మిగతా..2లో



## హరీష్‌రావుకు పితృవియోగం

### తండ్రి సత్యనారాయణ కన్నుమూత

- బావకు నివాళి అర్పించి.. అక్కను ఓదార్చిన కెసిఆర్
- కెటిఆర్, బిఆర్ఎస్ నేతల నివాళి
- మంత్రులు పొన్నం తదితరుల నివాళి
- సంతాపం తెలిపిన సీఎం రేవంత్, వైఎస్ జగన్

హైదరాబాద్,(అక్షరగళం): సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఇంట విషాదం నెలకొంది. హరీశ్ తండ్రి తన్నీరు సత్యనారాయణ కన్నుమూశారు. హైదరాబాద్ కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఆయన పార్థివ దేహాన్ని ఉంచారు. హరీశ్‌రావుకు పితృవియోగంపై మిగతా..2లో

### కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు


## శుభవార్త

- 8వ వేతన సవరణ కమిషన్‌కు కేబినేట్ ఆమోదం

న్యూఢిల్లీ,అక్టోబర్28(అక్షరగళం): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. కోటీ పదిహేను లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల, పింఛనుదారుల.. జీతాలు, పింఛన్లు పెంచేందుకు వీలుగా 8వ వేతన




కమిషన్‌కు కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రంజన దేశాయ్ ఈ పే కమిషన్‌కు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. ప్రస్తుత 7వ వేతన సవరణ సంఘం కాలపరిమితి 2026తో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ తర్వాత కొత్త వేతన సవరణ అమలు చేయడానికి వీలుగా 8వ పే కమిషన్‌ను మిగతా..2లో



## దూసుకు వస్తున్న మొంథా తుఫాన్

- కాకినాడ వద్ద తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో భారీగా ఈదురుగాలులు
- గంటకు 90 నుంచి వంద కి.మీ. వేగంతో ప్రచండగాలులు

విశాఖపట్నం,అక్టోబర్28(అక్షరగళం): బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తీవ్ర తుపానుగా బలపడింది. ఈ మేరకు విశాఖలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది.గంటకు 15 కి.మీ వేగంతో ఉత్తర వాయవ్య దిశగా తుపాను కదిలిందని తెలిపింది. ప్రస్తుతం మచిలీపట్నానికి 190 కి.మీ, కాకినాడకు 270కి.మీ, విశాఖపట్నానికి 340 కి.మీ దూరంలో తుపాను కేంద్రీకృతమైనట్లు వాతావరణ కేంద్రం మిగతా..2లో



## కేసులు నిజమైతే హైదరాబాద్ వీడుతా..

- లేదంటే కెటిఆర్, హరీష్ రావు వీడుతారా
- జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ సవాల్

హైదరాబాద్,అక్టోబర్28(అక్షరగళం): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ , బీఆర్ఎస్ నేతల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌పై బీఆర్ఎస్ నేతలు సంచలన ఆరోపణలు చేశారు. దీనికి ప్రతిగా నవీన్ యాదవ్ మిగతా..2లో



## మావోయిస్టులకు భారీ దెబ్బ పలువురు అగ్రనేతల లొంగుబాటు

- డిజిపి శిశధర్ ఎదుట లొంగిపోయిన నేతలు
- పుల్లూరి ప్రసాద్ రావు, బండిప్రకాశ్‌లో లొంగుబాటు
- లొంగిన వారిని పూర్తిస్థాయిలో ఆదుకుంటామన్న డిజిపి

హైదరాబాద్,(అక్షరగళం): మావోయిస్టులకు మరో దెబ్బతగిలింది. పలువురు అగ్రనేతలు లొంగిపోయారు. జనజీవన స్రవంతిలో కలవాలని తెలంగాణ ప్రభుత్వం పిలుపునిచ్చిన క్రమంలో రాష్ట్ర సర్కార్ పిలుపు మేరకు మావోయిస్టులు అజ్ఞాతం వీడారు. డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట మంగళవారం మావోయిస్టు అగ్రనేతలు లొంగిపోయారు. మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్ పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ శంకరన్న , చంద్రన్నా, మావోయిస్టు స్టేట్ కమిటీ మెంబెర్ బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్ లొంగిపోయారు. అయితే, పుల్లూరి ప్రసాద్ రావుపై రూ.25 లక్షలు రివార్డు ఉంది. బండి ప్రకాష్ అలియాస్ ప్రభాతలపై రూ.20 లక్షలు రివార్డు ఉంది. అయితే, అజ్ఞాతంలో 64 మంది తెలంగాణ మావోయిస్టులు ఉన్నారు. ఇప్పటి వరకు మిగతా..2లో

## హైదరాబాద్ అభివృద్ధి కోసం బిజెపిని గెలిపించండి

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఉధృత ప్రచారం
- పాదయాత్రలతో ఓటర్ల దగ్గరకు నేతలు
- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు నేతృత్వంలో మాస్ క్యాంపెయిన్
- పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై విమర్శలు
- జూబ్లిహిల్స్ అభివృద్ధికి హామీలు



హైదరాబాద్,అక్టోబర్28(అక్షరగళం): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రచారాన్ని ముమ్మరం చేసింది. మంగళవారం నియోజక వర్గంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు నేతృత్వంలో 'మాస్ కాంపెయిన్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నేతలు ప్రతి ఓటరునూ కలుసుకుని ఓట్లు అభ్యర్థించేలా పాదయాత్రలు ఘనంగా నిర్వహించారు. ఎన్ రామచంద్రరావు ఎర్రగడ్డ డివిజన్‌లో మిగతా..2లో




## బీహార్‌లో ఇంటికో ఉద్యోగం

- అధికారంలోకి రాగానే అమలు
- బిహార్ కా తేజస్వి ప్రణ్ పత్ర విడుదల
- మహాఘట్‌బంధన్ మేనిఫెస్టో విడుదలలో తేజస్వి

పాట్నా,అక్టోబర్28(అక్షరగళం): బిహార్ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను విపక్ష మహాగట్‌బంధన్ మంగళవారం నాడు విడుదల చేసింది. 'బిహార్ కా తేజస్వి ప్రణ్ పత్ర'అనే టైటిల్‌తో ఆర్జేడీ నేత, కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్, కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు. 'నూతన, అభివృద్ధి చెందిన బిహార్' తమ విజన్ అంటూ ప్రకటించింది. మిగతా..2లో

అక్షరగళం

## హరీశ్‌రావుకు పితృవియోగం

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం ఫిల్మ్ నగర్ మహాప్రస్థానంలో నిర్వహించారు. తన్నీరు సత్యనారాయణ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు. తన బావతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకుని, ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సమాచారం తెలిసిన వెంటనే హరీశ్ రావును ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కోకాపేటలోని హరీశ్ రావు నివాసానికి వెళ్లి, దివంగత సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. తన సోదరిని, కుటుంబ సభ్యులను ఓదార్చున్నారు. భర్తను కోల్పోయిన అక్క లక్ష్మమ్మకు కేసీఆర్ ధైర్యం చెప్పారు. ఇక హరీశ్‌రావును గుండెలకు హత్తుకుని కేసీఆర్ ఓదార్చారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తన్నీరు సత్యనారాయణ రావు కన్నుమూశారు. ఆయన పార్థివ దేహానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఉన్న ఆయన భౌతికకాయానికి





పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. హరీశ్ రావును, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సతీమణి శోభ.. హరీశ్ రావును ఓదార్చారు. సత్యనారాయణ రావు భౌతికకాయానికి నివాళు లర్పించారు. అదేవిధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బిగాల గణేశ్ గుప్తా, మెతుకు ఆనంద్, హరీశ్ రావును పరామర్శించారు. సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు నివాళి అర్పించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఏపీ మాజీ సీఎం జగన్ తదితరులు కూడా సంతాపం ప్రకటించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతి పట్ల ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ సంతాపం తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా విచారం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు తండ్రి మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. సత్యనారాయణ రావు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థించారు. ఈ నేపథ్యంలోనే వైఎస్ జగన్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడి సానుభూతి తెలియజేశారు.

## సినీ కార్మికులకు ప్రభుత్వం అండ

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సినీ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

యూసుఫ్‌గూడలో నిర్వహించిన సినీ కార్మికుల అభినందన సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినీ కార్మికుల సంక్షేమంపై సీఎం పలు కీలక హామీలు ఇచ్చారు. కృష్ణా నగర్‌లో మూడు నుంచి నాలుగు ఎకరాల్లో కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాల నిర్మిస్తాం. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం లంచ్ కూడా అందిస్తాం. రాజీవ్ ఆరోగ్యశ్రీతో పాటు ఉచిత వైద్యం కూడా అందిస్తాం అని చెప్పారు. తన మాటకు కట్టుబడి కృష్ణానగర్‌కు వచ్చానని గుర్తుచేసిన రేవంత్.. కార్మికుల కోసం ప్రభుత్వం చేయాల్సిన పనులు చేస్తాం. వెల్ఫేర్ ఫండ్‌కు 10 కోట్లు ఇస్తున్నాం. కష్టాల్లో ఉన్న కార్మికుల కోసం ఆ నిధులు వినియోగించండని అన్నారు. అంతేకాకుండా, సినిమా టికెట్ రేట్లు పెంచాలంటే కార్మికులకు 20 శాతం వాటా తప్పనిసరి ఇవ్వాల్సిందేనని అన్నారు.. ఆ వాటా వెల్ఫేర్ ఫండ్‌కు బదిలీ అవ్వాలి. లేదంటే టికెట్ ధరల పెంపుకు జీఓ ఇవ్వం అని స్పష్టం చేశారు. నిర్మాతలు, కార్మికులు కుటుంబ సభ్యుల్లా ఉండాలని సూచించారు. ఫైటర్స్, టెక్నీషియన్ల నైపుణ్యం పెంచేందుకు ఫ్యూచర్ సిటీలో భూమి కేటాయిస్తామని తెలిపారు. మీకు అవసరం ఉన్నప్పుడు మీకు అందుబాటులో ఉంటా. ప్రభుత్వం ఎల్లప్పుడూ మీ వెన్నంటి ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.సినీ కార్మికుల శ్రమ నాకు బాగా తెలుసు. మీ కష్టాలు తెలుసుకోలేనంతగా నా కళ్లు మూసుకోలేదని పేర్కొన్నారు. సినీ పరిశ్రమకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని సీఎం హామీ ఇచ్చారు. ఒకప్పుడు సినీ పరిశ్రమ అంటే మద్రాసే అనుకునే వారు. కానీ, నేడు తెలుగు సినిమా ఆస్కార్ అవార్డుల వరకు వెళ్లగలిగింది. ఈ గౌరవం తెర వెనుక కష్టపడే కార్మికుల శ్రమ ఫలితమే అని రేవంత్ అభినందించారు. నిలిచిపోయిన నంది అవార్డులను ప్రజాయుద్ధ నౌక గద్దర్ పేరుతో అవార్డులను ఇస్తున్నామని సీఎం తెలిపారు. హాలీవుడ్ కూడా తెలంగాణకు వచ్చి షూటింగ్ చేసుకునేలా మారాలి. చిన్న సినిమాలను తక్కువ చేసి చూసే ప్రసక్తే లేదు. ఐటీ రంగానికి ఎంత ప్రాధాన్యత ఇస్తామో, సినిమా పరిశ్రమకూ అంతే ప్రాధాన్యత ఇస్తాం అని ఆయన అన్నారు. ఐటీ, ఫార్మా పరిశ్రమలు ఎలాగో.. ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా అంతే. మీరు అండగా ఉంటే హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తా. హాలీవుడ్ సినిమాలు రామోజీ ఫిల్మ్‌సిటీ, హైదరాబాద్‌లో షూటింగ్‌లు జరిగేలా బాధ్యత తీసుకుంటాం. ప్రభుత్వం చేయగలిగిన పనులు చేస్తాం. సినిమా టికెట్ల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో 20శాతం కార్మికులకు ఇవ్వాలి. కార్మికులకు లాభాల్లో 20శాతం ఇస్తేనే టికెట్ల ధరలు పెంచుకునేందుకు జీవో ఇస్తాం. త్వరలోనే సినీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం అని సీఎం తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వాలు సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం కృషి చేసినట్లు చెప్పిన సీఎం రేవంత్. 1964లో నంది అవార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. హైదరాబాద్‌కు సినీ పరిశ్రమ రావడంలో మర్రిచెన్నారెడ్డి పాత్ర కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఎంతో మందిని సంప్రదించి పరిశ్రమను తెచ్చారని గుర్తుచేశారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికులను ఆదుకున్నారని.. కార్మికుల కోసం పది ఎకరాలు ఇచ్చారని తెలిపారు. పరిశ్రమను ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు సీఎం. సినీ కార్మికులకు ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిర్మాత, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు , పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు నీటి తరలింపు

(మొదటి పేజీ తరువాయి)

తుమ్మిడిహట్టి దగ్గర చేపట్టాల్సిన ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారులకి సీఎం పలు కీలక సూచనలు చేశారు. అలాగే, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల లేఖ రాశారు. ఈ లేఖపై మంగళవారం జరిగిన సమీక్షలో ఉన్నతాధికారులతో రేవంత్‌రెడ్డి చర్చించారు. సీఆర్ పాటిల్‌కి తాను రాసిన లేఖలో ప్రస్తావించిన అంశాలను అధికారులకు వివరించారు. తుమ్మిడిహట్టిపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ లేఖలో పేర్కొన్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రాజెక్టుల వారీగా అధ్యయనం చేసి పూర్తిస్థాయి నివేదికలను తయారు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపై స్టేటస్ రిపోర్ట్ తయారు చేయాలని సూచించారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితి పైనా సీఎం చర్చించారు. బ్యారేజీల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయా ప్రాజెక్టుల వారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్షా సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు.

## హైదరాబాద్ అభివృద్ధి కోసం బిజెపిని గెలిపించండి

(మొదటి పేజీ తరువాయి)

పాదయాత్రలో పాల్గొన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శ్రీనగర్ కాలనీ, ఎల్లారెడ్డిగూడలో, ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు సహా సీనియర్ పార్టీ నేతలు పాల్గొని విజయవంతం చేశారు.

### కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై తీవ్ర విమర్శలు

ఈ సందర్భంగా నేతలు మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన విధానాలపై మండిపడ్డారు. ఇప్పటివరకు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు అవకాశం కల్పించారని, ఈసారి బీజేపీకి అవకాశం ఇస్తే జూబ్లిహిల్స్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. పదేండ్లు బీఆర్ఎస్, రెండేండ్లుగా కాంగ్రెస్ జూబ్లిహిల్స్ నియోజకవర్గాన్ని ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. గడపగడపకూ తిరుగుతూ ఓటర్లకు కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసాలను వివరించారు. ఆరు గ్యారంటీలు సహా ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు.



ఎంఐఎం, కాంగ్రెస్ పొత్తుపై మండిపాటు

అభ్యర్థిని నిలబెట్టకుండా కాంగ్రెస్‌తో ఎంఐఎం లోపాయికారీ ఒప్పం దంపై మండిపడ్డారు. అధికారంలో ఎవరు ఉంటే వారితో కలిసిపోతూ హైదరాబాద్ అభివృద్ధిని ఎంఐఎం అడ్డుకుంటుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్, ఎంఐఎం అనైతిక పొత్తుతో ఎదురయ్యే సమస్యలను వివరించారు. రౌడీషీటర్లను ప్రోత్సహిస్తూ, కబ్జాలకు పాల్పడే వ్యక్తులకు ఈ రెండు పార్టీలు కొమ్ముకాస్తున్నాయని మండి పడ్డారు. ఎన్నికల పోటీలో లేకుండానే జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో పెత్తనం అంతా ఎంఐఎం చేస్తుందని ఆరోపించారు.

### అభివృద్ధి హామీలతో బిజెపిని గెలిపించాలని విజ్ఞప్తి

నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యలు, మంచినీటి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గుండాయిజం, కబ్జాలు, రౌడీషీటర్ల నుంచి రక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సహకారంతో జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. రోడ్లు, విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం.. అవసరమైన చోట బస్తీ దవాఖానాల ఏర్పాటు, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్స్ ఏర్పాటు చేస్తామని ప్రజలకు వివరించారు. ప్రజల కష్టాలు, ఇబ్బందులు ఆరా తీస్తూ కమలం గుర్తుకు ఓటు వేసి లంకల దీపక్ రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ నేతలు ప్రచారం చేశారు. బీజేపీకి ఓటు వేసి లంకల దీపక్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు

## మావోయిస్టులకు భారీ దెబ్బ - పలువురు అగ్రనేతల లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

427మంది లొంగిపోయారు. అందులో 8 మంది స్టేట్ కమిటీ, 2 సెంట్రల్ కమిటీ మెంబెర్లు లొంగిపోయారు. 9 మంది మాత్రమే తెలంగాణలో, మిగిలిన వారు వేరే రాష్ట్రాల్లో ఉన్నారు. సెంట్రల్ కమిటీలో 5 మంది తెలంగాణ మావోయిస్టులు ఉన్నారు. 10 మంది స్టేట్ కమిటీ మెంబర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 20 మంది డిస్ట్రిక్ కమిటీ, 14 మంది ఏరియా కమిటీల్లో, 10 మంది తెలంగాణ కమిటీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులపై ఎలాంటి చర్యలు ఉండవని డీజీపీ శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ ప్రకాశ్‌తో కలిసి మరో కీలక నేత పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయారు. మావోయిస్టుల లొంగుబాటు వివరాలను డీజీపీ మీడియా సమావేశంలో వెల్లడించారు. 1980లో పుల్లూరి ప్రసాదరావు కిషన్‌జీకి అనుచరుడిగా మారారు. 1981లో పీపుల్స్‌వార్‌లో చేరి.. 1983లో కమాండర్ అయ్యారు. 1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2008లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడయ్యారు. 17 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయారని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. మావోయిస్టు మరో నేత బండ ప్రకాశ్ అలియాస్ ప్రభాత్.. 45 ఏళ్లు వివిధ స్థాయిల్లో పనిచేశారు. అతని స్వస్థలం తెలంగాణలోని మందమర్రి. ఏడో తరగతి చదువుతున్నప్పుడే నక్సలిజం వైపు ఆకర్షితులయ్యారు. 2004లో జరిగిన శాంతి చర్చల్లో ప్రకాశ్ పాల్గొన్నారు. 2019లో స్టేట్ కమిటీ సభ్యుడ య్యారు. నేషనల్ పార్క్ ఏరియా కీలక ఆర్గనైజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. బండ ప్రకాశ్‌పై ఉన్న రూ.20లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం. పుల్లూరి ప్రసాదరావుపై ఉన్న రూ.25లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం. తెలంగాణకు చెందిన ఇంకా 64 మంది మావోయిస్టులు కొనసాగుతున్నారు. పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు నేతలపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ కరెక్ట్ కాదు. అవసరమైతే.. వారికి రక్షణ కల్పిస్తాం అని డీజీపీ తెలిపారు. మావోయిస్టులు చంద్రన్నా, బండి ప్రకాశ్ అజ్ఞాతం వీడారని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పిలుపు మేరకు అజ్ఞాతం నుంచి బయటికి వచ్చి జనజీవన స్రవంతిలో కలిశారని పేర్కొన్నారు. పుల్లూరి ప్రసాద్ రావ్ అ చంద్రన్నది పెద్దపల్లి మండలమని తెలపారు. చంద్రన్న15 ఏళ్ల కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారని గుర్తుచేశారు. మొదట రాడికల్ స్టూడెంట్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారని వెల్లడించారు. 1980లో కిషన్‌జీకి కొరియర్‌గా చేశారని గుర్తుచేశారు. 2008లోనే కేంద్ర కమిటీ మెంబర్‌గా చంద్రన్న ఉన్నారని తెలిపారు. 2024 డిసెంబర్ వరకు తెలంగాణ స్టేట్ కమిటీ సెక్రటరీగా ఉన్నారని వివరించారు. అక్టోబరు 21వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చంద్రన్న జన జీవన స్రవంతిలో కలిశారని చెప్పుకొచ్చారు. చంద్రన్న ఆరోగ్యం కూడా సహకరించకపోవడంతో అజ్ఞాతం వీడారని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీలో చీలిక వచ్చిందని లొంగిపోయిన మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్ పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ శంకరన్న తెలిపారు. తీవ్ర అనారోగ్య కారణాలతో తాను జనజీవన స్రవంతిలో కలిశానని చెప్పుకొచ్చారు. ఇప్పటి నుంచి ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని వెల్లడించారు. మావోయిస్టు భావజాలానికి తానెప్పుడూ కూడా విజ్ఞుడేనని స్పష్టం చేశారు. మావోయిస్టు పార్టీలో వచ్చిన విభేదాలు, చీలికల వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పుకొచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నక్సలైట్లు తమ సోదరులని.. లొంగిపోవాలని సీఎం పిలుపునిచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి పిలుపుమేరకు తాము ప్రజలతో కలిసి పని చేయాలని భావించామని పేర్కొన్నారు. అలాగే, తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి పిలుపు మేరకు సరెండర్ అయ్యామని పుల్లూరి ప్రసాద్ రావు స్పష్టం చేశారు.

## బీహార్‌లో ఇంటికో ఉద్యోగం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని మేనిఫెస్టో వాగ్దానం చేసింది. 20 రోజుల్లో ప్రతి కుటుంబంలోని ఒక వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని తెలిపింది. జీవికా దీదీలకు ప్రభుత్వ ఉద్యోగులుగా శాశ్వత హోదా కల్పిస్తామని ప్రకటించింది. కాంట్రాక్టు కార్మికులు, ఔట్‌సోర్సింగ్ వర్కర్లను పెర్మనెంట్ చేస్తామని, పాత పెన్షన్ పథకాన్ని తిరిగి తీసుకువస్తామని తెలిపింది.

రైతులు పండించిన పంటలన్నింటికీ కనీస మద్దతు ధర ఇస్తామని, మండీ, మార్కెట్ కమిటీలు పునరుద్ధరిస్తామని పేర్కొంది. జన్ స్వాస్థ్య సురక్ష యోజన కింద ప్రతి ఒక్కరికీ రూ.25 లక్షల ఉచిత ఆరోగ్య బీమా కల్పిస్తామని, జనాభాకు అనుగుణంగా 50 శాతం రిజర్వేషన్‌ను పెంచుతామని హామీ ఇచ్చింది. తేజస్వి యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్డీయే నేతల ప్రసంగాలు వినే ఉంటారని, ఒక్క నేత కూడా బీహార్‌ను ఎలా మందుకు తీసుకువెళ్తారో చెప్పడం లేదని అన్నారు. నితీష్‌కుమార్‌ను ఎన్డీయే కీలుబొమ్మగా పేర్కొన్నారు. బిహార్ సీఎం నితీష్‌కుమార్‌ను ఎన్నికల కోసమే బీజేపీ వాడుకుం టోందని, నితీష్ బిహార్ సీఎం కారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇప్పటికే ధ్రువీకరించారని, ఎన్నికల తర్వాత బీజేపీ నితీష్‌ను సీఎం చేసే ప్రసక్తే లేదని అన్నారు. ఇండియా కూటమి తనను సీఎం అభ్యర్థిగా ప్రకటించిందని, కానీ ఎన్డీయే ఒక్క మీడియా సమావేశంలో కూడా తమ సీఎం అభ్యర్థి ఎవరో ప్రకటించలేదని అన్నారు. కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహాగట్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థిని ముందుగా తామే ప్రకటించామని, ఇప్పుడు ఎన్నికల మేనిఫెస్టోను కూడా మొదటగా తాము విడుదల చేశామని చెప్పారు. దీనిని బట్టే బిహార్ విషయంలో తామెంతో కృతనిశ్చయంతో ఉన్నామో అర్థం చేసుకోవచ్చన్నారు.

తొలి రోజు నుంచి బిహార్‌కు ఏమి చేయదలచుకున్నామో డిసైడ్ చేసుకున్నామని, బిహార్‌కు తిరిగి పట్టాలపైకి తీసుకువస్తామని చెప్పారు. మహాగట్‌బంధన్ 'ప్రాణ పత్ర' కోసం బిహార్ రాష్ట్రం ఎదురుచూస్తోందని, ఈరోజు తమకు శుభదినమని అన్నారు. మహాగట్‌బంధన్ ఉప ముఖ్యమంత్రి అభ్యర్థి, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ చీఫ్ ముఖేష్ సహానీ మాట్లాడుతూ, నవీన బీహార్ కోసం సంకల్ప పత్రాన్ని ఈరోజు విడుదల చేశామని, రాబోయే 30-35 సంవత్సరాల పాటు బిహార్ ప్రజలకు సేవలందిస్తామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలను తాము నెరవేరుస్తామని, ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని వాగ్దానం చేశారు. రాష్ట్ర ప్రజలంతా మహాగట్‌బంధన్‌కు మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. ఎన్డీయేకు ఎలాంటి సంకల్పం లేదని, రాష్ట్రంలో ప్రభుత్వాన్ని హాగట్‌బంధన్ ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## ఏఐ టెక్నాలజీతో అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

తయారు చేయడం లేదా కాల్స్ చేయడం సాధ్యమవుతోంది. దీంతో వ్యక్తిగత, ఆర్థిక మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. తాజాగా పలు దేశాల్లోనే కాకుండా మన దేశంలో కూడా డీప్‌ఫేక్ ఆధారంగా మోసాలు జరుగుతున్నాయి. కొంతమంది మోసగాళ్లు మీ స్నేహితులు, బంధువులు, సహచరులు లేదా అధికారులుగా నటిస్తూ డబ్బు లేదా వ్యక్తిగత సమాచారం తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి మోసాలను గుర్తించడం చాలా కష్టంగా మారింది, ఎందుకంటే అవి నిజంగా ఉన్నట్లే కనిపిస్తాయి. ఇలాంటి మోసాల నుంచి రక్షణ పొందేందుకు ఒక సులభమైన కానీ అత్యంత ప్రభావవంతమైన పద్ధతి 'సేఫ్ వర్డ్'. అది మీరు మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సహచరులతో మాత్రమే పంచుకునే ఒక ప్రత్యేక పదం లేదా సంకేతం. ఏదైనా అనుమానాస్పద కాల్ లేదా మెసేజ్ వస్తే, ఆ వ్యక్తి నిజమా కాదా తెలుసుకోవడానికి ఆ 'సేఫ్ వర్డ్' అడగాల్సి ఉంటుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఈ విషయంలో ప్రజలకు హెచ్చరిక చేశారు. ఇలాంటి విషయాల్లో జాగ్రత్త అవసరమని అన్నారు.

సేఫ్ వర్డ్ ఎలా ఉపయోగించాలంటే.. మీకు అత్యంత నమ్మకమైన వారితో ఒక ప్రత్యేక సేఫ్ వర్డ్ నిర్ణయించుకోండి. అనుమానాస్పద కాల్ లేదా మెసేజ్ వచ్చినప్పుడు ఆ వర్డ్ అడిగి ధృవీకరించండి. ఆ సేఫ్ వర్డ్‌ను బయట ఎవరితోనూ పంచుకోకండి. బ్యాంక్




వివరాలు, క్షిఖలు లేదా వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకండి. ౦ఎ మన జీవితాన్ని సులభతరం చేస్తుంది, కానీ అదే మన భద్రతకు ప్రమాదం కావచ్చు. టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండటం, కొత్త మోసాలపై అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యం. 'సేఫ్ వర్డ్' వంటి చిన్న జాగ్రత్త ? పెద్ద ప్రమాదాల నుంచి మిమ్మల్ని కాపాడగలదన్నారు. ఇలాంటి మోసాలపై అవగాహన పెంచే ప్రయత్నంగా హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఎక్స్ లో ఒక హెచ్చరిక పోస్టు చేశారు. ఎఐ టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందుతుందో, అంతే జాగ్రత్త అవసరం అని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ భద్రత కోసం 'సేఫ్ వర్డ్' విధానం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఒక చిన్న జాగ్రత్త? పెద్ద మోసాల నుండి కాపాడుతుంది అంటూ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

## "ఏరో-ఇంజిన్" రాజధానిగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రెషర్ టర్బైన్ షాఫ్ట్ (రోటేటివ్‌కాంపోనెంట్) తయారవుతాయన్నారు. ఫలితంగా తెలంగాణ బ్రాండ్ విశ్వవ్యాప్త మవ్వడంతో పాటు కొత్తగా 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. "విమాన ప్రయాణ భవిష్యత్తును నిర్మించాలనుకుంటే – దానిని తెలంగాణలో నిర్మించండి" అని ఈ వేదికగా అంతర్జాతీయ దిగ్గజ ఏరో సంస్థలకు పిలుపునిచ్చారు.

ఇంజిన్స్, కాంపోనెంట్స్, ఎమ్మార్వో, కన్వర్షన్స్, స్పేస్, డ్రోన్స్, డిజిటల్, ఏఐ మాన్యుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో టాటా అడ్వాన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ సీఈవో, ఎండీ సుకరన్ సింగ్, ఈడీ మసూద్ హుస్సేన్, సాఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్స్ వైస్ ప్రెసిడెంట్ డొమినిక్ డూప్, టీజీఐఐసీ ఎండీ శశాంక, తెలంగాణ ఏరో స్పేస్ & డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ పీఏ తదితరులు పాల్గొన్నారు.

## కేసులు నిజమైతే హైదరాబాద్ వీడుతా..

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ నాయకులకి గట్టి సవాల్ విసిరారు. తన మీద పెట్టిన కేసులు నిజమైతే తాను రాజకీయాలని వదిలి.. హైదరాబాద్ విడిచి వెళ్లిపోతానని ఛాలెంజ్ చేశారు. కానీ ఆ కేసులు ఫాల్స్ అని తేలితే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రాజకీయాల నుంచి తప్పుకోవడానికి సిద్ధమా..? అంటూ సవాల్ విసిరారు. కేసీఆర్ ప్రభుత్వం తనపై, తన కుటుంబ సభ్యులపై, అనుచరులపై ఒకే సంవత్సరంలో 20 నుంచి 30 తప్పుడు కేసులు పెట్టిందని ధ్వజమెత్తారు. తన మీద రౌడీ అని ప్రచారం చేయడంపై బీఆర్ఎస్ నేతల కుట్ర ఉందని విమర్శించారు నవీన్ యాదవ్. తనకు న్యాయవ్యవస్థ నమ్మకం కలిగించిందని.. తనను కాపాడిందని ఉద్ఘాటించారు. అలాగే, కాంగ్రెస్ ప్రచార రథాన్ని తగులబెట్టే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలపై కూడా కేసు నమోదైందని తెలిపారు. పోలీసులు ఈ విషయంపై చర్య తీసుకుంటారని చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్‌పైన విశ్వాసం ఉంచారని నవీన్ యాదవ్ నొక్కిచెప్పారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కాంగ్రెస్ గెలుపుతోనే సాధ్యమవుతుందని నవీన్ యాదవ్ స్పష్టం చేశారు.

## దూసుకు వస్తున్న మొంథా తుఫాన్

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొంది. క్రమంగా ఉత్తర వాయవ్య దిశగా కదులుతోందని తెలిపింది. మంగళవారం సాయంత్రం లేదా రాత్రికి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీవ్ర తుపాను తీరం దాటే అవకాశముందని వెల్లడించింది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు గరిష్ఠంగా 110 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని అంచనా వేసింది. మొత్తంగా ఆంధ్రా వైపుకు ఎంతో వేగంగా దూసుకొస్తోంది. తుపాను నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేసేందుకు అధికారులు అంతా సిద్ధం చేసుకున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 90-110 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. తుపాను ప్రభావంతో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు అతిభారీ వర్షాలు కురవనున్నాయని తెలిపారు. కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచనలు చేశారు.

తీవ్ర తుఫానుగా రూపాంతరం చెందిన మొంథా మరికొన్ని గంటల్లో తీరం దాటనుంది. దీని ప్రభావంతో ఏపీ, ఒడిశా, తెలంగాణ, తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుఫాను ప్రభావంతో ఒడిశా, ఏపీలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. దీంతో బీచ్‌ల వద్ద అధికారులు భద్రతా చర్యలు చేపట్టారు. అలల ప్రభావం ఎక్కువగా ఉండటంతో పర్యాటకులను సముద్రం వైపు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ మైక్‌లలో అనౌన్స్ చేస్తున్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేయనున్నట్లు ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై పలువురు కేంద్ర మంత్రులు, మంత్రిత్వ విభాగాల సిబ్బందితో విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపింది. అనంతరం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్‌లో ఛైర్‌పర్సన్, ఇద్దరు సభ్యులు ఉండనున్నారు. ఈ సంఘం 18 నెలల్లో సిఫార్సులు ఇవ్వనుందని కేంద్రం ఓ ప్రకటనలో వెల్లడించింది. దేశంలో సుమారు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మంది పింఛనుదారుల వేతనాలు, భత్యాలు ఎంత ఉండాలో నిర్ణయించడంలో వేతన సంఘం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతమున్న జీతాలు, పింఛన్లను ఎంత మేర పెంచాలో ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం వేతన సవరణ చేపడుతుంది.

## జూబ్లీహిల్స్‌లో ప్రచార కార్యక్రమాలు రద్దు చేసుకున్న బిఆర్ఎస్

హైదరాబాద్,అక్టోబర్28(అక్షరగళం):

బీఆర్ఎస్ సీనియర్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు కన్నుమూశారు. ఈ నేపథ్యంలో మంగళవారం నాటి పార్టీ కార్యక్రమాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రద్దు చేశారు. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమాలను కూడా రద్దు చేస్తున్నట్లు ప్రటకించారు. మరోవైపు జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత.. హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

తెలంగాణ రౌండప్


# మద్యం సేవించి వాహనాలు నడిపిన 12 మందికి రూ.1,20,500ల జరిమానా



**సిద్దిపేట, అక్టోబర్ 28, (అక్షర గళం):** ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. గత కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, చౌరస్తాలలో, రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ చేయగా, 12 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా మంగళవారం సిద్దిపేట 1వ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కుమారి వి.తరణి, ముందు హాజరుపరచగా విచారణ చేసి 12 మందికి రూ.1, 20,500 వేల రూపాయల జరిమాన విధించారు మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి 10వేల రూపాయల జరిమానా అమల్లోకి రావడం జరిగిందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడవదని, రోడ్డు నిబంధనలు, , రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు మద్యం సేవించి వాహనాలు నడిపే ఒక్కొక్కరికి 10 వేల రూపాయల జరిమానా విధించడం అమల్లోకి రావడం జరిగిందని తెలిపారు.



## ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

**ఆమనగల్లు, అక్టోబర్ 28 (అక్షర గళం):**
ఆమనగల్లు మండల పరిధిలోని సీతారాం నగర్ తాండలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీవో కుసుమ మాధురి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. లబ్ధిదారులు ప్రభుత్వం సూచించిన విధంగా ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఇంటి నిర్మాణం పూర్తిచేసిన వెంటనే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటి నిర్మాణంలో అలసత్వం వహించవద్దన్నారు. అధికారుల నుంచి తగు సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు.

## హరీష్ రావు తండ్రికి జైపాల్ యాదవ్ సంతాపం

**ఆమనగల్లు, అక్టోబర్ 28 (అక్షర గళం):**
హరీష్ రావు తండ్రి తన్నీరు సత్య నారాయణరావు మంగళవారం మృతి చెందారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.



కోకాపేటలోని హరీష్‌రావు నివాసానికి చేరుకున్న వారు సత్య నారాయణరావు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం హరీష్ రావు, కేటీఆర్ లను పరామర్శించారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అమనగల్లు మండల అధ్యక్షుడు అర్జున్ రావులు ఉన్నారు.

## శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామీజీకి ఘన స్వాగతం

**హైదరాబాద్, అక్టోబర్ 28, (అక్షర గళం):**
హైదరాబాద్‌లో గల దేవాలయంలో జరిగే కుంభాభిషేక కార్యక్రమానికి వెళ్తున్న శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి వారికి మంగళవారం శ్రీ




జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆయన కాంచీపురం నుండి కర్నూలు, జడ్చర్ల మీదుగా.. హైదరాబాద్ లో గల దేవాలయంలో జరిగే కుంభాభిషేక కార్యక్రమానికి వస్తున్న ఆయనకు తెలంగాణ ప్రభుత్వ దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రవేశం ద్వారం పుల్లూరు టోల్ ప్లాజా వద్ద శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ అర్చకులు, శ్రీ జమ్ములమ్మ దేవాలయ ఈవో పురందర కుమార్ ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలతో స్వామీజీకి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ ఆశీస్సులు అందుకున్నారు.

## తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణకు ఎమ్మెల్యే నివాళులు

**కూకట్ పల్లి, అక్టోబర్ 28, (అక్షర గళం):** మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ స్వర్గస్తులయ్యారు. విషయం తెలుసుకున్న కూకట్పల్లి ఎమ్మెల్యే



మాధవరం కృష్ణారావు వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన మందలపు సాయిబాబా చౌదరి

**కూకట్‌పల్లి,అక్షరగళం:** కూకట్ పల్లి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మందలపు సాయిబాబు చౌదరి కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ నియోజకర్గ ఇంచార్జి బండి రమేశ్ ఆధ్వర్యంలో ఆయన అనుచరులతో కలిసి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సాయిబాబు చౌదరి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు. పార్టీ పటిష్టతకు పాటుపడుతానని అన్నారు.




## విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న ప్రభుత్వం

**- ఏబీవీపీ నాయకులు లండం మల్లేష్**

**ఆమనగల్లు, అక్టోబర్ 28 (అక్షర గళం):**
రాష్ట్రంలో విద్యావ్యవస్థను సీఎం రేవంత్ రెడ్డి భ్రష్టు పట్టిస్తున్నారని ఏబీవీపీ నాయకులు లండం మల్లేష్ ఆరోపించారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణ కేంద్రంలో బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి డిప్యూటీ తహసిల్దార్ వినోద్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలకు ఎన్నికల ముందే విద్యార్థులు గుర్తుకొస్తారన్నారు. అధికారంలోకి వచ్చాక విద్యార్థులను, విద్యావ్యవస్థను పట్టించు కోవడంలేదని మండిపడ్డారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్లు అవుతున్నా ముఖ్యమంత్రి స్పందించక పోవడం విద్యావ్యవస్థపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. హాస్టళ్లకు పక్కా భవనాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో రూ.8500 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్ బకాయిలు పెండింగ్లో ఉన్నాయన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో గోరటి భరత్, కోట్ర సురేష్, పాత్లవత్ రాకేష్, చెన్నంశెట్టి మల్లేష్, ఎడవల్లి అంజి, నేనావత్ సురేష్, సుమన్ నాయక్, తరుణ్ రాథోడ్, బద్రునాయక్, సునిల్, అనిల్ మాస్టర్ డిగ్రీ కళాశాల మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తలే పార్టీకి బలం

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, అక్టోబర్ 28 (అక్షర గళం):**
కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమైన శక్తి అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎంపికైన సురేందర్ రెడ్డిని మంగళవారం జూబ్లీహిల్స్ ప్రచారంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల కృషి వల్లే కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగిరిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో నాయకులు ఎన్ని కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసినా మొక్కవోని ధైర్యం, ఆత్మ విశ్వాసంతో కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఆపదలో ఉంటే ఎప్పుడైనా తాను అండగా ఉంటానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మండ్లి రాములు, జిల్లా నాయకులు కృష్ణ నాయక్, మాజీ సర్పంచ్లు ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, కడమోని శ్రీశైలం, డైరెక్టర్ చేగురి వెంకటేష్, విజయ్ నాయక్, మాజీ ఎంపిటిసి బెల్లంకొండ యాదయ్య, సీనియర్ నాయకులు నక్కపోతు నర్సింహ, వల్లపుదాసు నరసింహ గౌడ్ గారు వల్లపుదాస్ రమేష్, రామక్రిష్ణ, పత్య నాయక్, జైపాల్, రాజ్యు నాయక్, పత్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి అభివృద్ధికి బాటలు వేద్దాం

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, అక్టోబర్ 28 (అక్షర గళం):**
జూబ్లిహిల్స్ నియోజకవర్గంలోని కాలనీవాసులు, వెజిటబుల్ మార్కెట్ వ్యాపారవేత్తలు, ప్రజలందరూ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రచారంలో కోరారు. మంగళవారం నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్యేతో ఆమనగల్లు, కడ్తాల్ మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ప్రజలు కాంగ్రెస్ కు ఓటు వేసి గెలిపిస్తారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకుల అసత్య ప్రచారాన్ని ఓటర్లు నమ్మే స్థితిలో లేరని,



పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిని ప్రజలు ఇంకా మరిచిపోలేదని ఆయన స్పష్టం చేశారు. స్థానికుడు, ప్రజల కష్ట సుఖాల్లో అందరికీ ఎప్పుడూ అండగా ఉండే నవీన్ యాదవ్ ను గెలిపించుకుంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మండ్లి రాములు, జిల్లా నాయకులు కృష్ణ నాయక్, మాజీ సర్పంచ్లు ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, కడమోని శ్రీశైలం, డైరెక్టర్ చేగురి వెంకటేష్, విజయ్ నాయక్, రామక్రిష్ణ, పత్య నాయక్, జైపాల్, రాజ్యు నాయక్, పత్య తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి శ్వేతా రాము సన్మానం..



**ఆమనగల్లు, అక్టోబర్ 28 (అక్షర గళం):**
ఇటీవల నీట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి ఎంబీబీఎస్ అడ్మిషన్ సీటును సాధించిన కడ్తాల్ మండలం మద్రిపల్లి గ్రామానికీ చెందిన ఈర్లపల్లి మహేశ్వరి యాదయ్య కుమార్తె శ్రావణి ని ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి శ్వేత రాము మంగళవారం పట్టణ కేంద్రంలో ఘనంగా శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్వేత రాము మాట్లాడుతూ.. సాధారణ కుటుంబానికి చెందిన విద్యార్థిని ఎంబిబిఎస్ సీటు సాధించడం పట్ల అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని నీట్ లో ఉత్తీర్ణత సాధించడం నిజంగా హర్షించదగ్గ విషయమని ముందుగా వారి తల్లిదండ్రులకు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు అభ్యసించి, వైద్యరంగంలో శిఖరాగ్రాలను అధిరోహించి పేదలకు సేవ చేయాలని ఆశీర్వదించారు. అనంతరం విద్యార్థిని మాట్లాడుతూ శ్రద్ధగా చదివి వైద్యురాలిగా రాణిస్తానని, ప్రజలకు తమ వంతుగా ప్రజలకు సేవలు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో పూసల భాస్కర్, శ్రీను నాయక్, గజ్జె యాదయ్య, ఈర్లపల్లి శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## ఎన్పీడిసిఎల్ సంస్థకు దక్కిన రెండు ఐఎస్ఓ (9001 & 45001) సర్టిఫికేట్లు

**కూకట్‌పల్లి, అక్టోబర్ 28, (అక్షర గళం):**
నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌కు అత్యంత ప్రతిష్టాత్మకమైన రెండు ఐఎస్ఓ సర్టిఫికేట్లు దక్కినాయి. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఈ రెండు సర్టిఫికెట్లను ఎన్పీడీసియల్ సీఎండీకి అందచేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ కార్యకలాపాలు, సబ్ స్టేషన్ల నిర్వహణ, సబ్‌స్టేషన్ నిర్మాణాల్లో అత్యుత్తమ నాణ్యతను గుర్తిస్తూ ఐఎస్ఓ 9001:2015 క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సర్టిఫికేట్ ప్రదానం చేయబడిందనీ ఇదో ఎంతో గర్వ కారణమని అన్నారు. ఉద్యోగుల భద్రతపై అను నిత్యం తీసుకుంటున్న చర్యలకు గాను అలాగే విద్యుత్ అధికారుల పల్లె బాట, పట్టణబాట వంటి కార్యక్రమాలు, భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ సంస్థ అనుసరిస్తున్న సురక్షా ప్రమాణాలను గుర్తిస్తూ ఐఎస్ఓ 45001:2018 ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సర్టిఫికేట్ కూడా ప్రదానం చేయబడిందనీ పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక సర్టిఫికేట్లు హెచ్వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థచే జారీ చేయబడ్డాయి. తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా ఎన్పీడిసిఎల్ సంస్థ రెండు ఐఎస్ఓ (9001 & 45001) సర్టిఫికేట్లను పొందడం ద్వారా కార్యనిర్వహణలో అత్యుత్తమ పనిప్రదేశాలలో, భద్రత పరంగా ఒక మైలురాయి నిలుస్తుందని స్పష్టం చేశారు.







## జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శ్రీ కజ్జం ఉమాపతి

**వెల్దండ, అక్టోబర్ 28 (అక్షర గళం):** నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదా వత్ సంతోష్ గారిని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కలెక్టర్ బాదావత్ సంతోష్ గారికి జన్మదిన శుభాకాంక్షలు డిఎస్ సిడిఓ ఉమావతి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఆయురారోగ్యాలతో జీవించాలని, జిల్లా అభివృద్ధికి మంచి తోడ్పాటును అందిచాలని ఆయన కోరారు. అలాగే కలెక్టర్ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారు సూపరిండెంట్ శ్రీమతి యస్.రాగమణి సీనియర్ అసిస్టెంట్ కెకవిత జూనియర్ అసిస్టెంట్‌లు సర్వ శ్రీ కూన స్కైలాబ్, కె.వెంకటేష్, యం.తిరుపతయ్య అంజయ్య తదితరులు పాల్గొన్నారు.




## రోడ్లను ఆక్రమించిన దుకాణాలను తొలగించండి

### - కమిషనర్ శంకర్ నాయక్

**ఆమనగల్లు, అక్టోబర్ 28 (అక్షర గళం):** హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారి (ఎన్.హెచ్ 765)పై ఆక్రమిస్తూ నిర్వహిస్తున్న దుకాణాలను తొలగించాలని కమిషనర్ శంకర్ నాయక్ ఆదేశించారు. వీటివల్ల నిరంతరం ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. జాతీయ రహదారి ఆనుకొని ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారుల దుకాణాలను మంగళవారం సీఐ జానకి రామ్ రెడ్డి, ఎస్ఐ వెంకటేష్ సహకారంతో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ పర్యవేక్షించారు. దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని వారు సూచించారు. అదేవిధంగా రోడ్లను ఆక్రమించి ఇష్టానుసారంగా ఆటోలను పార్కింగ్ చేయరాదని, ప్రత్యమయంగా వేరే చోట పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. లేనిచో మున్సిపల్ చట్టం 2019 ప్రకారము చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వారి వెంట పోలీస్, ట్రాఫిక్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు తదితరులు ఉన్నారు.



## సామాజిక తెలంగాణతోనే బడుగులకు న్యాయం

### రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పదేళ్లు లూటీ చేస్తే కాంగ్రెస్ దాన్ని కొనసాగిస్తుంది

### రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్

**భద్రాద్రి కొత్తగూడెం 28 అక్టోబర్ (అక్షర గళం):** తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ అధ్యకులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ "సామాజిక చైతన్య రథయాత్ర" మంగళవారం కొత్తగూడెంకు చేరుకుంది. బుల్లెట్ వెంకన్న ఆధ్వర్యంలో టీఆర్ఎల్‌డీ కళా బృందం ప్రదర్శనలు నగర ప్రజానీకాన్ని

ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కొత్తగూడెం సూపర్ బజార్ సెంటర్లో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్ లో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో బీసీల లో చైతన్యం పెల్లుబికి వచ్చిందని, అగ్ర వర్ణాల దోపిడీ పాలనను అంతం మొందించాలంటే బీసిలు ఎస్సీ, ఎస్టీ లతో జతకట్టి రాజ్యాధికారాన్ని సాధించాల్సిన అవసరం ఉందన్నారు. అసలు






జోనల్ సిస్టం తెలంగాణలో అవుతుందో లేదో తెలియదు కానీ సీఎం కుటుంబ సభ్యులు వారి అనుచరులు ఈ రాష్ట్రాన్ని జోనల్ గా విభజించి భూదందాలకు, అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. సింగరేణి సంస్థ లాభాల ఆపేక్షతో పర్యావరణానికి తీవ్ర నష్టాన్ని చేకూరుస్తుందని, తక్షణమే ఓపెన్ కాస్ట్ మైనింగ్ ఆపివేసి ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడి అండర్ గ్రౌండ్ మైనింగ్ మాత్రమే చేయాలన్నారు. సింగరేణి సంస్థలో విపరీతమైన అవినీతి దోపిడీ జరుగుతుందని, 49శాతం కేంద్ర వాటా ఉంది కాబట్టి నేరుగా సీబీఐతో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం, కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరులలో పూర్తి స్థాయిలో పోడు భూములకు పట్టాలు ఇవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలను సంవత్సరం లోపు భర్తీ చేస్తామని నిరుద్యోగులను వంచించిందన్నారు. తక్షణమే ఇచ్చిన హామీమేరకు ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆర్ఎల్‌డీ తరుపున డిమాండ్ చేస్తున్నామని, నిరుద్యోగ బృతి కూడా పాత బకాయిలతో సహా చెల్లించాలి అని ఆర్ఎల్‌డీ డిమాండ్ చేస్తోందన్నారు. నిరుద్యోగులకు శిక్షణ ఇస్తామని ఆడంబరంగా ప్రారంభించిన స్కిల్ యూనివర్సిటీలో ఏడాదిన్నర గడిచిన ఒక బ్యాచ్ కి కూడా శిక్షణ ఇవ్వలేక పోయిందని ఏద్దేవా చేశారు. టీఆర్ఎల్‌డీ ఆధ్వర్యంలో నేషనల్ స్కిల్ మినిస్టర్ మరియు టీఆర్ఎల్‌డీ జాతీయ అధ్యక్షులు శ్రీ జయంత్ సింగ్ సహకారంతో ఖమ్మం, కొత్తగూడెం, నల్గొండ, వరంగల్ జిల్లా ప్రతీ రెండు నెలలకు ఒక సారి జాబ్ మేళాలు నిర్వహించి యువతకి శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. టీఆర్ఎల్‌డీ కి చెందిన "లక్ష్యం" యూట్యూబ్ ఛానల్ ను సబ్స్క్రయిబ్ చేసుకుంటే ఈ జాబ్ మేళాల వివరాలన్నీ తెలుసుకోవచ్చన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కూడా వంచించిందని, తులం బంగారం ఎటు పోయిందో, నెలకు 2500 బృతి డబ్బులు ఎటుపోయాయో ఇప్పటి వరకు అర్థం కావటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులతో పాటు టీఆర్ఎల్‌డీ నాయకులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యకులు కట్ట సతీష్ యాదాద్రి భువనగిరి అధ్యక్షులు బీరప్ప, ప్రధాన కార్యదర్శులు మడకం ప్రసాద్ దొర, నూనె భాస్కర్ రావు, రిషబ్ జైన్, నరసింహరావు, సుధాకర్, జీ.వి. రిషబ్, జైస్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిని నిరోధించడంలో అందరు భాగస్వాములు కావాలి

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి

**మేడ్చల్ ప్రతినిధి, అక్టోబర్ 28, (అక్షరగళం):** విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ పై ఉద్యోగులకే కాకుండా ప్రజలకు అవగాహన కల్పించి అవినీతిని నిరోధించడంలో అందరు భాగస్వాములు కావాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హైదరాబాద్ రూరల్ యూనిట్ రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ పి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్త, విజయేందర్ రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి డిపార్ట్ మెంట్ నుండి ప్రజలకు ఏఏ సేవలు అందిస్తారనే అంశాలను ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అవగాహన వారోత్సవాల ద్వారా ఉద్యోగులలో, ప్రజలలో పూర్తి అవగాహన కల్పించి అవినీతి, అక్రమాలను నిరోధించాలని అన్నారు. ప్రభుత్వ మార్గనిర్దేశాల మేరకు విజిలెన్స్ ద్వారా ప్రభుత్వానికి రావలసిన అన్ని రకాల ఆదాయాలకు గండి పడకుండా చూడడం, ప్రభుత్వం చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అనవసర ఖర్చు అవినీతి జరగకుండ,ప్రభుత్వ వనరులను సహజ వనరులను దుర్వినియోగం కాకుండా కాపాడడం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ అన్నారు. విజలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా తమ తమ శాఖలలో క్రింది స్థాయి వరకు ఎక్కడ అవినీతి జరుగకుండా తమ విధులలో పారదర్శకత, జవాబుదారీతనం తో విధులు నిర్వహించాలని సూచించారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా డివిజన్, మండల్ల మున్సిపల్ స్థాయిలో వారోత్సవాలు నిర్వహించాలని ఇందులో భాగంగా స్కూళ్లలో క్విజ్ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, ప్రజలలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్ని విభాగాలు కూడా ఈ కార్యకలాపాలను చేపట్టి ఫోటోలు పంపాలన్నారు.. అడిగిన సమాచారాన్ని ఏలాంటి సమస్యలు లేకుండా అందించాలన్నారు. విధి నిర్వహణలో ఏలాంటి వత్తిళ్లకు గురికాకుండా నిజాయితీగా సేవలందించాలన్నారు. రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పాల్వాయి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అవినీతిరహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రభుత్వ అధికారులందరూ సహకరించాలన్నారు. ప్రభుత్వ నిధులు దారి మళ్లకుండా, అనవసరపు నిర్మాణాలు ఖర్చులు జరుగకుండా, అవినీతిని నిరోధించడమే విజిలెన్స్ ప్రధాన లక్షమని అన్నారు. విజిలెన్స్ డిపార్ట్ మెంట్ కు ప్రతి డిపార్ట్ మెంట్ సహాయ సహకారాలు అందించాలన్నారు. అన్ని శాఖలు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తూ అవినీతిరహిత సమాజానికి తోడ్పడాలన్నారు. విజిలెన్స్ శాఖ వారు ప్రారంభించిన టోల్ ఫ్రీ నెం.14432 ను ప్రజలందరు వినియోగిచుకొని అవినీతి సమాచారాన్ని అందించాలని కోరారు. అనంతరం కలెక్టర్ విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు పోస్టర్ ను రిలీజ్ చేసి, సిబ్బందితో విజిలెన్స్ పరిపాలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, విజిలెన్స్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## పైపులు పగిలిపోయినా, ఇతర సమస్యలు తలెత్తినా వాటిని సకాలంలో మరమ్మత్తు చేయాలి

### శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరేకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 28, (అక్షర గళం):** పైపులు పగిలిపోయినా, ఇతర సమస్యలు తలెత్తినా వాటిని సకాలంలో మరమ్మత్తు చేయాలని శేరిలింగంపల్లి శాసన సభ్యులు అరేకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్ నగర్ లోని హెచ్ఎండబ్ల్యుఎస్ అండ్ ఎస్బీ సర్కిల్ -4 కార్యాలయం లో ఎండి కే.అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో త్రాగునీటి, డ్రైనేజీ సమస్యలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన తో పాటు శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూచయ డివిజన్ లో డ్రైనేజి సమస్య దాదాపుగా పరిష్కరించామని, కొన్ని కాలనీల్లో, బస్తీల్లో అరకొరగా డ్రైనేజీ సమస్య ఉందని ప్రజల నుండి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థను సరిగ్గా డిజైన్ చేయడం, సరైన వాలు, పైపుల వ్యాసం ఉండేలా చూసుకోవాలని సూచించారు. డ్రైనేజీ పైప్లైన్ త్రాగునీటి పైప్లైన్ లో కలవకుండా క్రమ పద్ధతిగా వేసినట్లయితే నీటి కాలుష్య సమస్యలు



తగ్గుతాయాన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్ ఆపరేషన్స్ పీవీ శ్రీధర్, సీజీఎం నారాయణ, జిఎం కృష్ణ, జిఎం హరిశంకర్, జిఎం శ్రీనివాస్ రెడ్డి, మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్, అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, బాలింగ్ గౌతమ్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, వాటర్ వర్క్స్ మేనేజర్ అభిషేక్ రెడ్డి, వాటర్ వర్క్స్ మేనేజర్ సందీప్ కుమార్ ,తదితర డివిజన్ల డిజీఎంలు, మేనేజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

### జిల్లా గవర్నర్ మహేందర్ కుమార్ రెడ్డి

**ఆమనగల్లు, అక్టోబర్ 28 (అక్షర గళం):** విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ మహేందర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ



ఆసుపత్రిలో ఆప్తామిలక్ అధికారి ఎం. చంద్రశేఖర్ పదవీ విరమణ సందర్భంగా మంగళవారం పట్టణ కేంద్రంలోని ఎస్ఎస్ఎస్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మహేందర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఆప్తామిలక్ అధికారిగా చంద్రశేఖర్ తనకు కేటాయించిన విధుల పట్ల నిబద్ధతో పనిచేశారని, వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బందితో స్నేహభావంగా ఉంటూ క్రమ శిక్షణతో విధులు నిర్వహించేలా పర్యవేక్షించారన్నారు.

కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు చెన్న కిషన్ రెడ్డి, దామోదర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి లింగయ్య, గోవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము, బాబా, వైద్యాధికారులు మైమున బేగం, మంజులా దేవి, సీహెచ్ఓ విజయలక్ష్మి, హెచ్ఈఓ తిరుపతిరెడ్డి, వైద్య సిబ్బంది డిపిఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, రవికుమార్, సూపర్వైజర్ నాగేశ్వరి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.




# రోడ్డుపైన గుంతలు.. విద్యార్థుల స్కూలు ప్రయాణం ఎలా..?

వెల్దండ అక్టోబర్ 28 (అక్షర గళం): వెల్దండ మండల కేంద్రంలో హై స్కూల్ మోడల్ స్కూల్ వెళ్లే రోడ్డుపై గుంతలు ఉండటం వలన విద్యార్థులు వెళ్లడం దారి ఎలా హై స్కూల్ మోడల్ స్కూల్ కు వెళ్లే రోడ్డుపై గుంతల మయమైంది. నిత్యం ఈ రోడ్డుపై అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ గుంతలమయమైన రోడ్డులో వెళ్లాలంటే విద్యార్థులు ఇతర గ్రామాలకు వెళ్ళే ప్రయాణికులు బావుల కాడికి వెళ్లే ప్రజలు వాహనదారులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మరమ్మతుకు నోచుకోవడం లేదని



విద్యార్థులు గ్రామస్తులు, వాహన దారులు వాపోతున్నారు. పాఠశాలలకు విద్యార్థులు బావుల దగ్గరికి వెళ్లే ప్రజలు వెల్దండ నుండి ఇతర గ్రామాలకు గుండాల బొల్లంపల్లి చెదురుపల్లి బైరాపూర్ చారగొండ తండాలకు చేరుకోవాలంటే కిందపడి లేచి ప్రయాణించాల్సి వస్తోందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని విద్యార్థులు గ్రామ ప్రజలు స్థానికులు కోరుతున్నారు.

# భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్**

వెల్దండ అక్టోబర్ 28 (అక్షర గళం): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత కొన్ని రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సింగల్ విండో



డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ అన్నారు వెల్దండ మండల కేంద్రంలోని ప్రజలందరూ అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని నీటిలో ఉండే వంతెనలు కట్టలు దాట వద్ద జలపాతాలు వాగులు నదులు చెరువులకు వెళ్లవద్దు.. ఎలక్ట్రిక్ పోల్‌లు, వైర్లను తాకవద్దు.. పురాతన భవనంలో ఉండవద్దు.. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక. శ్రద్ధ వహించాలి వాహనదారులు జాగ్రత్త గా ప్రయాణించాలని రైతులు చెట్ల కింద కరెంటు వైర్ల కింద ఉండొద్దు. ప్రజలందరూ పైన చెప్పిన అన్ని విషయాలు దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి

**- సీఐ ఆంజనేయులు**

కీసర, అక్టోబర్ 28,(అక్షర గళం): శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని కీసర సీఐ ఆంజనేయులు అన్నారు. పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన చౌరస్తా, అంబేడ్కర్ విగ్రహం వద్ద సిఐ ఆంజనేయులు,ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రైవేట్ కళాశాల విద్యార్థుల తో,భారీ



జెండా ఊపి పోలీసు అధికారులు,సిబ్బంది ర్యాలీని ప్రారంభించారు.అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ కీసర కేంద్రంలో జాతీయ రహదారిపై కొనసాగింది. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ... అమరులైన పోలీస్ సిబ్బందికి,వారి కుటుంబ సభ్యులకు ఇదే మా వందనమంటూ.. పోలీసులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీస్ అమరవీరులకు జోహార్ జోహార్ అంటూ.. జేజేలు పలికారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐలు స్టేషన్ సిబ్బంది, ప్రైవేట్ కళాశాల విద్యార్థుల,ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 2న బీ.ఆర్.ఎస్ పార్టీలో చేరటానికి అంగీకారం

శేరిలింగంపల్లి, అక్టోబర్ 28, (అక్షర గళం): బీ.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.ఆర్‌ని చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం నవంబర్ 2



ఆదివారం ఉదయం 11.00 గంటలకు అనుచరులతో కలిసి బీ.ఆర్.ఎస్ పార్టీ లో చేరటానికి అంగీకారం తీసుకున్నారు. భారీ ఎత్తున చేరనున్నట్లు మాజీ కార్పొరేటర్ తెలిపారు. పార్టీని బలోపేతం చేయటమే ముఖ్య ఉద్దేశమన్నారు. శేరిలింగంపల్లి లో చెల్లచదరూ అయి.. ఇతర పార్టీ లో చేరిన ఉద్యమకారులు అందరూ సొంత గూటికి చేరాలని విజ్ఞప్తి చేశారు. బీ.ఆర్.ఎస్ పార్టీని బలోపేతం చేసి.శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీ.ఆర్.ఎస్ పార్టీ జెండాను ఎగురవేద్దామన్నారు.

# స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**- స్టేట్ జాయింట్ సెక్రెటరీ అలివేలి రాజు**

హైదరాబాద్, అక్టోబర్ 28, (అక్షర గళం): తెలంగాణలోని పేద విద్యార్థులకు రావలసిన 8500 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని స్టేట్ జాయింట్ సెక్రెటరీ అలివేలి రాజు డిమాండ్ చేశారు. మంగళవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దిల్ సుక్ నగర్ నగర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న 8500 కోట్ల స్కాలర్షిప్ లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాస్తారోకో ధర్నా నిర్వహించి అర్ధనగ్న ప్రదర్శన చేశారు. అనంతరం. స్టేట్ జాయింట్ సెక్రెటరీ అలివేలి రాజు మాట్లాడుతూ స్కాలర్షిప్ లు ప్రభుత్వం విద్యార్థులకు వేసే బిక్ష కాదు విద్యార్థుల హక్కు అని వెంటనే స్కాలర్షిప్ లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్కాలర్షిప్ లు విడుదల చేయని యెడల రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టు పనులలో కమిషన్లు మంత్రులు, ఎమ్మెల్యేలు కమిషన్లు తీసుకుంటూ విద్యార్థులకు రావలసిన స్కాలర్షిప్ రిలీజ్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన ఇప్పటికీ విద్యార్థులకు రావలసిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం అంటే పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడం పనిగా పెట్టుకున్నారు రేవంత్ రెడ్డి చెప్పే మాటలకు చేసే చేతులకు పొంతన లేకుండా పోయిందన్నారు. రియంబర్స్మెంట్ రాని కారణంగా ప్రవేట్ కళాశాల యజమాన్యాలు కళాశాలల సిబ్బందికి జీతాలు ఇవ్వని పరిస్థితి అదే విధంగా కోర్స్ కంప్లీట్ చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు అదేవిధంగా గవర్నమెంట్ కళాశాలలో ఫీజు రియంబర్స్మెంట్ విడుదల కాని కారణంగా మౌలిక వసతులు కల్పించడంలో ఫెయిల్ అవుతున్నాయి కావున కాంగ్రెస్ ప్రభుత్వం మేకపోతు గాంభీర్యం ప్రదర్శించకుండా విద్యార్థులకు రావలసిన రియంబర్స్మెంట్ విడుదల చేయాలి. ఈ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తూ జూబ్లీహిల్స్ బై



ఎలక్షన్ లో సైతం ప్రతి ఏబీవీపీ కార్యకర్త విద్యార్థులు వారి వారి తల్లిదండ్రులను జాగృతం చేసి ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడగొట్టడమే పనిగా కార్యచరణ మొదలుపెడతాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అక్యారి మహేష్, జిల్లా కన్వీనర్ గంగాధర్, నగర కార్యదర్శి విశ్వ తేజ, నాయకులు విజయ్, రిషిత్, బబ్లు, తదితరులు పాల్గొన్నారు.


# రిక్రియేషన్ క్లబ్ వారు 50 వేల రూపాయలు విరాళం అందజేత

వెల్దండ అక్టోబర్ 28 (అక్షర గళం): వెల్దండ మండల కేంద్రంలోని ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కోతులు విద్యార్థులు స్కూలుకు వెళుతున్న క్రమంలో విద్యార్థుల పైకి కోతులు ఎగబడుతున్నావి విద్యార్థులు స్కూల్‌కు వెళ్లాలంటే భయపడుతున్నారు ఇంటి ఆవరణంలో కూర్చున్న ఇంటి పైనుంచి వచ్చి వృద్ధులపై దాడి చేయడం ఇండ్లలో చొరబడి ఇంటిలో ఉన్న నిత్యంతర సరుకులను ఎత్తుకెళ్లడం వెల్దండ ప్రజలు చాలా ఇబ్బందుల గురవుతున్న విషయం తెలుసుకున్న వెల్దండ రిక్రియేషన్ క్లబ్ సభ్యులు వెల్దండ మండల కేంద్రం నుండి కోతులను పట్టుకొని దూరపు ప్రాంతపు అడవులలో వదిలేయడం కోసం 50 వేల రూపాయలు విరాళంగా రిక్రియేషన్ క్లబ్ సభ్యులు ఎన్నం వెంకట్ రమణ రెడ్డి రమేష్ రెడ్డి బాలకృష్ణ గౌడ్ వెంకటయ్య గౌడ్ గ్రామ పెద్దలకు యువకులకు అందజేశారు కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ ఎండి రషీద్ మట్ట విష్ణు గౌడ్ రామకృష్ణ శ్రీనివాస్ రెడ్డి రామకృష్ణ మట్ట శేఖర్ గౌడ్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# అన్నపూర్ణాదేవికి అష్టోత్తర శత 108 కలశ స్నపన పూజ

కీసర,అక్టోబర్ 28, (అక్షర గళం): నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ వి నగర్ రోడ్ నెంబర్ 8లో శ్రీ లక్ష్మీ గణపతి అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం శ్రీ అన్నపూర్ణాదేవికి అష్టోత్తర శత 108 కలశ స్నపన పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మూల మంత్ర హెూమం, రుద్రాభిషేకం, చండీ పారాయణ, ధాన్యాధి వాసాంగ హెూమాలు, విశ్వావసు గంధర్వ హెూమం, మూల మంత్ర హెూమం, రుద్రహెూమం, చండీ హెూమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆలయంలో శ్రీ కోదండ రామాంజనేయ స్వామి, శ్రీవల్లి దేవసేనా సహిత సుబ్రహ్మణ్యస్వామి, నాగబంధ, మృత్యుంజయ, మేధా దక్షిణామూర్తి, అభయాంజనేయ, నవగ్రహ విగ్రహ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఎంవిఎల్ఎన్ శాస్త్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ సుబ్రహ్మణ్య శర్మ సహాయకులు జమ్మలమడక శ్రీరమణ శర్మ,



ఆలయ అధ్యక్షులు దాచా శ్రీనివాస్ గుప్తా ఎర్రం ఈశ్వరయ్య గుప్త, లింగా నాగేంద్రగుప్త, పీవీవీ. సత్యనారాయణ నరసింహస్వామి



గౌడ్, గంగిరెడ్డి నరేందర్ రెడ్డి, మారెళ్ల వెంకటేశ్వ రావు, వి.నర్సింహాస్వామిగౌడ్, ఆంజనేయ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.




# దేశసేవలో అమరులైన పోలీసులను స్మరించుకోవాలి

**- అడిషనల్ డీసీపీ వెంకటరమణ**

కుషాయిగూడ, అక్టోబర్ 28 (అక్షర గళం):

దేశసేవలో అమరులైన పోలీసు లను స్మరించుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనరేట్ మల్కాజ్గిరి జోన్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ అన్నారు.అమరవీరుల వారోత్సవాలలో భాగంగా మంగళవారం పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాల ను పురస్కరించుకొని రాచకొండ కమిషనర్,ఐపీఎస్ ఆదేశాల మేరకు కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో కుషాయిగూడలోని వివిధ విద్యాసంస్థల విద్యార్థులతో కలిసి కుషాయిగూడ పోలీస్ స్టేషన్ నుండి రాధిక చౌరస్తా వరకు ఘనంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాధిక చౌరస్తా లో విద్యార్థులు,పోలీసులు కలిసి అమరవీరుల త్యాగాలకు సంఘీభావంగా మానవహారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ... ఎంతోమంది పోలీసులు దేశం కోసం ప్రాణాలు అర్పించి అమరులైనారన్నారు. ప్రజల ప్రాణాలను రక్షించడంలో పోలీసుల కృషి ఎంతో గొప్పదన్నారు.ఈ ర్యాలీలో కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి,ఎస్‌హెచ్‌ఓ ఎల్. భాస్కర్ రెడ్డి,ఎస్ఐలు సుధాకర్ రెడ్డి, వెంకన్న,శ్రీనివాస్,సాయిలు,విజయ, సతీష్‌తో పాటు కుషాయిగూడ పోలీస్ సిబ్బంది, పరిసర పోలీస్ స్టేషన్ ల సిబ్బంది,విద్యాసంస్థల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




# 1.27 ఎకరాల పార్క్ స్థలానికి విముక్తి

**కబ్జా చెరనుంచి విడిపించిన హైడ్రా**

హైదరాబాద్,అక్టోబర్ 28 (అక్షర గళం):

అక్రమ కట్టడాలు కూల్చేవేతే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా.. ఆ దిశగా దూసుకుపోతోంది. మంగళవారం నగరంలో వేర్వేరు చోట్ల ఆక్రమణలు తొలగించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతో కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఆయన ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్ విలేజ్‌లోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో 1.27 ఎకరాల పార్క్ కబ్జా చేశారంటూ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా.. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పరిశీలించింది. పార్కు స్థలాన్ని లేఔట్‌లో చూపించి తర్వాత ప్లాట్లుగా విక్రయిస్తున్నారని గ్రహించి ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా కాపాడినట్టు పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది. శేరిలింగంపల్లి జోన్ చందానగర్ సర్కిల్ పరిధిలోని గంగారాం కాలనీలో సుభాష్‌నగర్ పేరిట 1974లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు చెందినవారు లే ఔట్ వేశారు. ఇందులో 700 గజాల స్థలాన్ని ప్రజావసరాలకు కేటాయించారు. పేదల అవసరాల కోసం కేటాయించబడిన ఈ లేఔట్‌లో బడాబాబు పాగా వేశారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాన్ని ఎలాట్లుగా మార్చాడు. ఇలా ఆక్రమణలకు గురైన స్థలాన్ని కాపాడాలని అక్కడి నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన హైడ్రా ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసింది.

# సంపాదకీయం..

## ఎల్ఐసి ఉనికికే ప్రమాదం!

ఆదానీతో మోడీ బంధం ఎంతో బలమైనది. అది ఫెవికాల్ లాంటిది. దానిని విడదీయడం అంత సులువు కాదు. గత పదేళ్లుగా ఇది రుజువైన విషయం. ఆదానీ కంపెనీపై వరుసగా విమర్శలు వస్తున్నా ..ఏనాడూ చర్యలు తీసుకోలేదు. సరికదా ఖండించడానికి కూడా ప్రధాని మోడీ పెదవి విప్పలేదు. ఆదానీ వ్యవహారంపై గతంలో పార్లమెంట్ స్తంభించింది. ఆదానీ గ్రూపు ఆర్థిక అవతవకలు, అమెరికా సంస్థ ఆరోపణలు అలా ఉండగానే తాజగా ఆ కంపెనీకి ఎల్ఐసి మొత్తాన్ని ధారపోసారు.గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం నడిచింది. ప్రతిష్టాత్మక ప్రభుత్వరంగ సంస్థ అయిన భారత జీవిత బీమా సంస్థ ఎల్ఐసిని అదానీ ప్రయోజ నాల కోసం కేంద్ర ప్రభుత్వం బలి పెట్టడంపై వస్తున్న విమర్శలను సైతం పట్టించుకోవడం లేదు. అంటే ప్రధాని మోడీ తన ప్రధాని పదవిని అడ్డం పెట్టి ఆదానీకి అండగా నిలబడ్డారని వేరుగా చెప్పనక్కరలేదు. కోట్లాదిమంది పాలసీదారుల, ఉద్యోగుల, అధికారుల ప్రయోజనాలను అదానీ వ్యాపార కాంక్షకు సమిధలు చేయడం అమానుషం. నిజానికి గతంలోనే ఎల్ఐసిని ప్రైవేటీకరించాలని చూశారు. దీనిపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వచ్చాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సైతం ప్రైవేటీకరణకు రంగం సిద్ధం చేశారు. కానీ బిజెపికి పూర్తి మెజార్టీ రాకపోవడం, ఎపిలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడడంతో ఆగిపోయింది. ఎల్ఐసిని ప్రైవేటీకరిస్తే ఆదానికి అప్పగించేవారేమో అన్న అనుమానాలు ఇప్పుడు కలుగుతున్నాయి. దేశీయంగా ఉన్న కంపెనీలను ఇలా తన తాబేదార్లకు కట్టబెట్టే కుట్ర లోపాయకారిగా జరుగుతున్నదని ప్రజలు గుర్తించాలి. ఎల్ఐసి మొత్తాలను ఆదానికి






అప్పుగా బదిలీ చేయడంపై దేశంలో అప్పుడే నిరసనలు మొదలయ్యాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలుగు రాష్ట్రాల్లో లెఫ్ట్ నేతలు కూనంనేని సాంబశివరావు, బివి రాఘవులు వంటివారు, మరికొందరు నిరసనల గళం విప్పారు. బీహార్ ఎన్నికల సందడిలో ఇదంతా గుట్టు చప్పుడు కాకుండా సాగిపోతోంది. సామాన్యుల చెమట చుక్కలే పెట్టుబడిగా ఎదిగిన ఎల్ఐసికి చెందిన వేల కోట్ల రూపాయల మొత్తాన్ని అదానీ గ్రూపునకు గుట్టుచప్పుడు కాకుండా మళ్ళించేందుకు అత్యున్నత స్థాయిలో కుట్ర జరిగిందన్నది చెప్పకనే చెప్పవచ్చు. అమెరికా నుండి వెలువడే 'వాషింగ్టన్ పోస్ట్' పత్రికలో ఈ కథనం తొలుత రావడం గమనార్హం. అంతర్జాతీయంగా విత్తసంస్థలు అదానీకి అప్పులు ఇవ్వడానికి నిరాకరిస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం 3.9 మిలియన్ డాలర్లు అంటే 33 వేల కోట్ల రూపాయలను అదానీ గ్రూపునకు మళ్లించడానికి సిద్ధమైందని వార్తలు వచ్చాయి. ఇందులో భాగంగానే అదానీ పోర్ట్స్ అనుబంధ సంస్థ రుణాల రీఫైనాన్స్ కోసం జారీ చేసిన 585 బిలియన్ డాలర్ల దాదాపు రూ.5,000 కోట్లు బాండ్లను ఎల్ఐసి కొనుగోలు చేసింది. 'అదానీపై లంచం, మోసం ఆరోపణలపై అమెరికా కోర్టుల్లో కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అనేక అమెరికా, యూరోపియన్ బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వెనుకాడాయి. కానీ.. భారత ప్రభుత్వం మాత్రం అదానీ కోసం ప్రత్యేక ఆర్థిక మద్దతు ప్రణాళికను రూపొందించిందని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్), ఎల్ఐసి నుండి పొందిన అంతర్గత పత్రాలు సహా అధికారులు, బ్యాంకర్లతో ఇంటర్వ్యూల ఆధారంగా ప్రభుత్వం ఈ నిధుల మళ్లింపునకు ఏ విధంగా పాల్పడిందో గుర్తించామని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొందంటే పథకం ఎంత పకడ్బందీగా రూపొందించారో తేటతెల్లమవుతుంది. ఆదానీ పోర్ట్సు అప్పటికే తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించడం కోసం బాండ్లను జారీ చేయాలని నిర్ణయించుకున్న సమయంలోనే ఉన్నత స్థాయిలో ఎల్ఐసి నిధుల తరలింపునకు సంబంధించిన ప్రణాళిక సిద్ధమైందని అర్థం అవుతోంది. మే 30వ తేదీన అదానీ పోర్ట్సు విడుదల చేసిన మొత్తం బాండ్లను ఎల్ఐసి కొనేసింది. అదానీ గ్రూపు షేర్లు, బాండ్లు

కొనడానికి విదేశీ విత్త సంస్థలేవీ సిద్ధం కాని నేపథ్యంలో భారత ప్రభుత్వరంగ బీమా సంస్థచేత కొనిపించి, అదానీ గ్రూపునకు విశ్వసనీయత కల్పించాలన్నదే ఆ పథకంలో భాగంగా అర్థం చేసుకోవచ్చు. ఆ పాచిక పారింది కనుకనే అంతకు ముందు వెనక్కి తగ్గిన అమెరికా సంస్థ ఏథెన్ ఇన్సూరెన్స్ జూన్‌లో 750 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.6,650 కోట్లు పెట్టుబడులు పెట్టింది. ఆదానీ ఆర్థిక అక్రమాలు, అవినీతిపై 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వరుస రిపోర్టులను విడుదల చేసింది. అదానీ కృత్రిమంగా తన కంపెనీల షేర్లను పెంచుకుంటున్నారని.. డొల్ల కంపెనీలతో పన్నులు ఎగ్గొడుతున్నారని విశ్లేషించింది. అదానీ కంపెనీలు ప్రమాదకర అప్పుల్లో ఉన్నాయని కూడా వెల్లడించిన విషయం తెలిసిందే. దీనికి తోడు తాజాగా వాషింగ్టన్ పోస్ట్ రిపోర్ట్ ఇటు ప్రభుత్వ వర్గాల్లోనూ, అటు ఇన్వెస్టర్లు, కార్పొరేట్ వర్గాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. అయితే అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి తమపై ఎవరి ఒత్తిళ్లు లేవని ఎల్ఐసి పేర్కొంది. బోర్డు ఆమోదించిన విధి విధానాల మేరకే తాము పెట్టుబడులు పెడతామని, వాటిపై తమదే తుది నిర్ణయమని బుకాయించింది. అందువల్ల ఎల్ఐసిలో ఏం జరుగుతుందో దేశ ప్రజలకు తెలపడం ప్రభుత్వ బాధ్యత. ఈ వ్యవహారంపై పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించడం అవసరమన్న డిమాండ్‌ను కూడా ఆమోదిం చాలి. ఇంతపెద్ద మొత్తంలో వ్యవహారం గుంభనంగా సాగడాన్ని అడ్డుకోవాలి. ఎల్ఐసిని మరోమారు ప్రైవేట్ రంగానికి అప్పగించే కుట్రలో కూడా ఇదో భగంగా చూడాలి. అందుకోసం ప్రభుత్వంపై ప్రజల ఒత్తిడి పెరచాలి. పాలకుల కార్పొరేట్ అనుకూల నిర్ణయాలపై నిలదీయాలి. లేకుంటే ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్ కావడం ఖాయం. దీనిపై విపక్ష కాంగ్రెస్ గట్టిగా నిలబడాలి. నిజానిజాలను వెల్లడించేందుకు పోరాటం చేయాలి. ఓట్ చోరీ పక్కన పెట్టి ఎల్ఐసిని రక్షించే పోరాటానికి దిగాలి. అందుకు దేశంలోని ప్రజలు కూడా అడుగులు వేయాలి.

## రెండుచోట్ల ఓటరు గుర్తింపు

### ప్రశాంత్ కిషోర్‌కు ఇసి నోటీసులు

బీహార్ ఎన్నికల వేళ ఈసీ నకిలీ ఓటర్లపై చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్‌కు ఎన్నికల కమిషన్ నోటీసులు జారీ చేసింది. శ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాల్లో ఆయనకు రెండు ఓటరు ఐడీలు ఉన్నట్లు గుర్తించడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. ఈ విషయంపై మూడు రోజుల్లో స్పందనను






తెలియజేయాలని పీకేకు సూచించింది. త్వరలో జరగనున్న బిహార్ ఎన్నికల్లో పీకే పార్టీ పోటీచేయనున్న నేపథ్యంలో ఈసీ చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎన్నికల అధికారులు వెల్లడించిన అధికారిక రికార్డుల ప్రకారం..ప్రశాంత్ కిశోర్‌కు పశ్చిమ బెంగాల్‌ని కాళీఘాట్ రోడ్‌లో ఓటరు ఐడీ ఉంది. ఇది తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం చిరునామా. 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇక్కడి నుంచే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోటీ చేశారు. అప్పట్లో పీకే టీఎంసీ పార్టీకి రాజకీయ సలహాదారుగా పనిచేశారు. బిహార్‌లోని తన స్వస్థలం కార్గహార్ నియోజకవర్గంలోనూ పీకే ఓటరుగా నమోదయ్యి ఉన్నారు. ప్రశాంత్ కిశోర్‌కు ఈసీ నోటీసులపై జన్ సురాజ్ పార్టీ ప్రతినిధి కుమార్ సౌరభ్ సింగ్ స్పందిస్తూ..ఇది ఎన్నికల సంఘం తప్పిదమేనని అన్నారు. ఓటరు కార్డుల జారీ విషయంలో సక్రమంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఈసీకి ఉందని పేర్కొన్నారు. ప్రశాంత్ కిశోర్ వంటి ప్రముఖుల విషయంలో తప్పులు చేసిన ఎన్నికల సంఘం ఇక సామాన్యుల విషయాల్లో ఎలా వ్యవహరిస్తుందో అన్నది తెలిసిన విషయమేనన్నారు.

# 17శాతం ఉన్నా సిఎంగా అవకాశం ఏదీ..?

### ఎన్‌డిఎ, ఇండియా కూటముల మోసపూరిత రాజకీయం

### బీహార్ ఎన్నికల ప్రచారంలో ఓవైసీ విమర్శలు

బిహార్ జనాభాలో 17 శాతం మైనారిటీలు ఉన్నప్పటికీ ముస్లిం ముఖ్యమంత్రి ఎందుకు లేరని ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. ఇటు ఎన్డీయే, అటు 'ఇండియా' కూటమి ముస్లింలను మోసగిస్తున్నాయని విమర్శించారు. గోపాల్ గంజ్ నుంచి బిహార్ ఎన్నికల ప్రచారానికి ఒవైసీ మంగళవారంనాడు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని 32 నియోజకవర్గాల్లో ఎంఐఎం పోటీ చేస్తోంది. 'రాష్ట్ర జనాభాలో 17 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ముస్లింలు ఎందుకు సీఎం కాకూడదు? జనాభాలో 3 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక వ్యక్తి ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తామని హామీ ఇస్తే దానితోనే సరిపుచ్చుకోవాలని అనుకుంటున్నారు' అని ఒవైసీ అన్నారు. ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిగా నిషాద్ నేత ముఖేష్ సహానిని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఇటీవల ప్రకటించారు. సమాజంలోని ఇతర వర్గాలతో పాటు ముస్లింలకు కూడా ఉప ముఖ్యమంత్రి పదవి కల్పిస్తామని హామీ ఇచ్చారు.బీజేపీపై మైనారిటీల్లో ఉన్న భయాన్ని ఆసరాగా తీసుకుని కాంగ్రెస్, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలు ముస్లిం ఓట్లకు గాలం వేస్తున్నాయని, అయితే ఈ పార్టీలు బీజేపీని అడ్డుకోలేవని ఒవైసీ అన్నారు. టిక్కెట్ల పంపిణీలో జనాభా ప్రాతిపదికన టిక్కెట్లు ఇవ్వలేని అవకాశవాద పార్టీల మాయలో పడవద్దని అన్నారు. ముస్లిం కమ్యూనిటీ సొంతంగా నాయకత్వాన్ని పటిష్టం



చేసుకోవాలని సూచించారు. కేంద్రంలోని బేజీపీపైనా ఒవైసీ విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నివర్గాల ప్రగతి కోసం పాటుపడుతున్నామని చెబుతుంటారని, కానీ ఆయన పార్టీ ఒక్క ముస్లింకు కూడా ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వలేదని ఆక్షేపణ తెలిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సైతం పదపదే చొరబాటుదారుల ప్రస్తావన చేస్తూ మైనారిటీలను విమర్శిస్తుంటారని, ఇంతపెద్ద ఎస్ఐఆర్ చేపట్టి ఎంతమంది చొరబాటుదారులను నిలువరించారో చెప్పాలని అన్నారు. అమిత్‌షా మంత్రిత్వ శాఖ పరిధిలోని బీఎస్ఎఫ్ దేశ సరిహద్దులో మోహరించి ఉండగా చొరబాట్లు ఎలా కొనసాగుతున్నాయో చెప్పాలన్నారు. ఈ అంశాలపై అసెంబ్లీలో బిహార్ ముస్లింలు నిలదీయాలను


కుంటే ఎఐఎంఐఎం పతంగి గుర్తుకు ఓటేయాలని కోరారు. మోదీ మనసు అహ్మదాబాద్‌పై, నితీష్ మనసు రాజ్‌గిర్‌పై, లాలూ మనసు ఆయన కొడుకుపైనా ఉంటుందని, సామాన్య ప్రజానీకం గురంచి వారికి ఆలోచనే లేదని ఒవైసీ విమర్శించారు.

# ప్రాణనష్టం జరక్కుండా చర్యలు చేపట్టాం

మొంథా తుపాన్ ప్రభావం 40 లక్షల మందిపై ఉందని మంత్రి లోకేశ్ అన్నారు. ఎక్కడా ప్రజల ప్రాణాలకు ముప్పు ఉండకూడదన్నదే ఈ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు లోకేశ్, అనితలు స్పష్టం చేశారు. ఈ తుపాన్ ప్రభావం ఉన్న 1,320 గ్రామాల ప్రజలకు అన్ని విధాలుగా సహకారం అందించా మన్నారు. 1906 షెల్టర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇప్పటికే తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించామని.. వాటిని షెల్టర్లుగా మార్చామని వివరించారు. ఈ విపత్తు సమయంలో 11 ఎన్డీఆర్ఎఫ్, 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. మొంథా తుపాన్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యూఏఈకి వెళ్లక ముందు సమీక్ష నిర్వహించారని లోకేశ్, హోం మంత్రి అనిత తెలిపారు. ఈ తుపాన్ పై ఇప్పటి వరకు ఆయన 12 సార్లు సమీక్ష నిర్వహించారని వెల్లడించారు. మంగళవారం రాజధాని అమరావతిలో మంత్రులు లోకేశ్, అనిత విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ రాత్రి 11.30 గంటలకు ఈ తుపాన్ ల్యాండ్ ఫాల్ అవుతుందని తాము అంచనా వేస్తున్నట్లు చెప్పారు. తుపాన్ దిశను బట్టి సిబ్బందిని మోహరించామన్నారు. గతంలో పంచాయతీ రాజ్ మంత్రిగా ఉన్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు సీపీడబ్ల్యూ బృందాలను ఏర్పాటు చేసి జనరేటర్లు సిద్ధం చేశామని మంత్రి నారా లోకేశ్ గుర్తు చేశారు. అలాగే సెల్ టవర్ల వద్ద జనరేట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మంగళవారం రాత్రి అంతా ఆర్టీజీఎస్‌లో ఉండి తుపానును మానిటరింగ్




చేస్తామన్నారు. ఇక ప్రతి రెండు గంటలకు ఒకసారి సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తారని తెలిపారు. తుపాన్ తీరం దాటిన అనంతరం సహాయ, పునరావాస చర్యలను సకాలంలో నిర్వహిస్తామని స్పష్టం చేశారు. బీచ్‌లు, లోతట్టు ప్రాంతాలకు వెళ్ల వద్దని ప్రజలకు ఈ సందర్భంగా సూచించారు.



తమకు సహకరించాలని ప్రజలకు మంత్రులు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో బీచ్‌లకు వెళ్లి వీడియోలు చేయడం సరికాదని పేర్కొన్నారు. తుపాన్ ప్రభావం నేపథ్యంలో ఎమ్మెల్యేలు, ఎంపీలతో ఇప్పటికే తాము మాట్లాడామన్నారు. వందలాది గ్రామాలకు తీవ్ర ముప్పు పొంచి ఉందని.. వారిని తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించామని చెప్పారు. ప్రజలు సైతం చెట్లు పడిపోయిన విషయాన్ని ఫొటోలు తీసి పంపితే వెంటనే వాటిని క్లియర్ చేస్తున్నామని వివరించారు. తుపాన్ అధిక ప్రభావం ఉన్న గ్రామాల్లో 10 నిమిషాల్లో రహదార్లు క్లియర్ చేయాలని సీఎం చంద్రాబాబు ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. చాలా ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఇప్పటికే తొలగించామన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టామన్నారు. వాట్సాప్, ఎస్ఎంఎస్ ద్వారా అలర్ట్‌లు పంపుతున్నామని తెలిపారు. రియల్ టైమ్‌లో రిపోర్టులను ప్రధాని కార్యాలయానికి ఎప్పటికప్పుడు పంపిస్తున్నామని చెప్పారు. ఇక రాత్రి 11.30 గంటల నుంచి రిలీఫ్ రీహ్యాబిలిటేషన్ వివరాలు సైతం ప్రధానికి తెలియజేస్తామన్నారు. నియోజక వర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు ఉండేలా వారితో ఇప్పటికే మాట్లాడినట్లు వివరించారు. అందరూ సిద్ధంగా ఉండాలన్నదే తమ ఉద్దేశ్యమని మంత్రులు స్పష్టం చేశారు. శాటిలైట్ల ద్వారా కింద ఎంత నీరు ఉందో కూడా చూసే అవకాశం ఉందన్నారు. అందుకు తగినట్లుగా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. అయితే సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు ఇప్పటికే తీరానికి చేరుకున్నారని మంత్రులు నారా లోకేశ్, అనిత వివరించారు.

# కాకినాడ వద్ద తీరం దాటిన మొంథా తుఫాన్

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు సమీపంలో మొంథా తుపాన్ తీరాన్ని తాకిందని అమరావతి ఐఎండీ ప్రకటించింది. పూర్తిగా తీరాన్ని దాటేందుకు మూడు నుంచి నాలుగు గంటలు సమయం పట్టే అవకాశం ఉందని పేర్కొంది. తీరాన్ని దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్లు వేగంతో గాలులు వీస్తాయని స్పష్టం చేసింది. కాకినాడ-మచిలీపట్నం మధ్య మొంథా తుపాన్ తీరాన్ని తాకిందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. గడిచిన 6 గంటల్లో గంటకు 17 కి.మీ వేగంతో తుపాన్ కదిలిందని పేర్కొన్నారు. ప్రస్తుతానికి మచిలీపట్నానికి 120 కిమీ, కాకినాడకి 110 కిమీ, విశాఖపట్నానికి 220 కిమీ దూరంలో కేంద్రీకృతమైందని తెలిపారు. పూర్తిగా తీరం దాటడానికి 3-4 గంటల సమయం పడుతోందన్నారు. దీని ప్రభావంతో కోస్తా వెంబడి గంటకు 90-100 కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వివరించారు. ప్రజలు సురక్షితంగా ఇంట్లోనే ఉండాలన్నారు. కృష్ణా జిల్లాలోని గుడివాడలో తుఫాను ప్రభావంతో భారీ గాలులతో పలుచోట్ల ప్రధాన రహదారుల్లో చెట్లు నేలకూలాయి. ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్, గుడివాడ ముదినేపల్లి ప్రధాన రహదారిలో వృక్షాలు నేల కూలాయి. గుడివాడ - విజయవాడ ప్రధాన రహదారిలో వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రోడ్డుకి ఇరువైపులా ట్రాఫిక్ నిలిచి పోయింది. హుటాహుటిన విపత్తు స్పందన / అగ్నిమాపక శాఖ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. చిమ్మ చీకటిలో ఆధునిక యంత్ర సామాగ్రితో రోడ్లపై కూలిన చెట్లను బృందాలు తొలగిస్తున్నాయి. ముదినేపల్లి ప్రధాన రహదారిలో కూలిన వృక్షాలను గుడివాడ రూరల్ పోలీసులు తొలగించారు. ప్రకాశం జిల్లాలో తుపాను ప్రభావంతో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు పడుతున్నాయి. ఈదురు గాలులతో ఒంగోలుతో పాటు తీర ప్రాంత గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాగులుప్పలపాడు మండలం చదలవాడ వద్ద రామన్న చెరువుకి గండి పడింది. ఒంగోలు - చీరాల రహదారిపైకి భారీగా వరద






నీరు వచ్చి చేరింది. ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు క్లియర్ చేస్తున్నారు. వర్షాల ధాటికి సంతనూతలపాడు చెరువు నిండి అలుగు పారుతుంది. ఒంగోలు - చీమకుర్తి రహదారిపై వరద నీరు భారీగా ప్రవహిస్తోంది.

ముందస్తు చర్యల్లో భాగంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. చెట్లు పడి, విద్యుత్ తీగలు తెగి, స్తంభాలు కూలిన ప్రదేశాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పరిస్థితిని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. నిపిపివేసిన ప్రాంతాల్లో త్వరితగతిన విద్యుత్ పునరుద్ధరించేలా మంత్రి ఆదేశాలు జారీ చేశారు. సమస్య తలెత్తిన ప్రాంతాల్లో సిబ్బంది వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

విశాఖపట్నంలో మొంథా తుఫాన్ బీభత్సం సృష్టించింది. బలమైన ఈదురుగాలుల కారణంగా భారీ చెట్లు, స్తంభాలు విరిగిపడ్డాయి. కుండపోత వర్షం కురవడంతో వైజాగ్ లోని సింధియా రోడ్డు నీట మునిగింది. కొన్ని చోట్ల రోడ్డుకి అడ్డంగా పడిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఒక ప్రాంతంలో కారుపై భారీ వృక్షం పడటంతో వాహనం ధ్వంసమైంది. కొన్ని ప్రదేశాల్లో భారీ ట్రాఫిక్ జామ్ అయింది. అధికారులు చెట్లను తొలగిన్నారు. భారీ వర్షాల కారణంగా విజయవాడ దుర్గగుడ ఘాట్ రోడ్డుని అధికారులు మూసివేశారు. కనకదుర్గ నగర్, లిఫ్ట్ మార్గం ద్వారా అమ్మవారిని దర్శించుకోవాలంటూ భక్తులకు అధికారులు సూచించారు.



# ఆత్మ నుండి... ఆత్మలోకి

మనిషి అనేక ప్రాకృతిక చర్యలను గుర్తించలేడు. ఉదాహరణకు తాను భూమిలో భాగమై ఉండటం వలన భూభ్రమణాన్ని గమనించలేడు. అలాగే, తన శరీరంలో జరిగే చర్యలను గుర్తించలేడు. తనకున్న పరిమితులు, తన దృక్పథంతో మాత్రమే ఆలోచించడం వలన అనేక అపోహలు, నమ్మకాలు కలుగుతాయి. కొన్నింటిని ఇతరుల నుండి స్వీకరించి, కొన్ని స్వతహాగా ఊహించి అనుకూల వాదనలు చేస్తూ ఉంటాడు. ఈ మార్గం సరైంది కాదని తెలుసుకున్న భారతీయ ఆధ్యాత్మిక పరిశోధకులు హేతువు నుండి పరిశోధన మొదలు పెట్టారు. ఏది హేతువో అది ఆత్మ అని నిశ్చయించారు. ఆ ఆత్మ నుండే పదార్థం ఉద్భవిస్తోందని, తిరిగి దానిలోనే లయమైపోతోందని నిర్ధారించారు. ఈ సూత్రాన్ని ఒడిసిపడితే చాలు, అన్నింటికీ సమాధానం దొరికిపోతుంది.



మనం మన తల్లిదండ్రుల ద్వారా ఉద్భవించినట్టు అనిపించినా, మన ఈ పరిణామరూపం ఆత్మచేత, ఆత్మ ద్వారా, ఆత్మ నుండి, ఆత్మలోనే జరుగుతుందని గుర్తించ గలుగుతాము. ఈ విధంగా మన ఆలోచనలను హేతుమార్గంలో విస్తృత పరచుకుంటే ఆత్మ అర్థమౌతుంది. అర్థమైన ఆత్మను అంతటా, అన్నింటా దర్శించే ప్రయత్నమే తపస్సు. ఈ తపస్సు నిరంతర ఆలోచనల్లో నిండిపోతే కలిగేదే ఆత్మసందర్శన లేక భగవత్సాక్షాత్కారం.ఆ ఆలోచనలను ఆచరిస్తే కలిగే స్థితే బ్రహ్మస్థితి. అంటే సాధకుడు 'అహం బ్రహ్మాస్మి' స్థాయికి చేరుకుంటాడు.'ఈశావాస్యోపనిషత్తు' చెప్పినట్లుగా బ్రహ్మస్థితిలో ఉన్న సాధకుడికి తన చుట్టూ ఉన్న ఏ జీవీ అల్పమైనదిగానో, అసహ్యకరమైనదిగానో కనిపించదు.

అన్నింటా ఈశ్వరుడు కనిపిస్తే ఏహ్యాభావమెలా కలుగుతుంది? అలాగే, వస్తువాసనలు నశించిపోతాయి. అందువల్ల అరిషడ్వర్గాలు ఆవిరైపోతాయి.అరిషడ్వర్గాలు నశిస్తే దుఃఖానికి స్థానమెక్కడుంటుంది? దుఃఖమే లేనప్పుడు మనసంతా ఆనందమయమే కదా! ఈ ఆనందం మనకు కలిగే సంతోషాలకు భిన్నమయిందీ, ఉన్నతమయింది. సంతోషం స్వల్పకాలిక మానసిక ప్రతిస్పందన కాగా, ఈ ఆనందం ఎలాంటి మానసిక స్పందనలూ లేని స్థిరస్థితి.దీనిలో అలజడులకూ, హెచ్చుతగ్గులకూ స్థానం లేదు. అలా నిశ్చలమై, నిరంతరమై ఉంటుంది. సాధకునికి తనలో, తన చుట్టూ కలిగే పరిణామాలకు సంబంధమే ఉండదు. సాధకుడి పని సాధకునిది.అదే కర్మతో, ప్రతిఫలంతో సంబంధం లేని మోక్షస్థితి. అందరూ ఆశించే పరమాత్మ సన్నిధి.

## దైవం



**సర్వదేవతావ్రత సమాహారంగా, సర్వవ్రత సింహావలోకనంగా చెప్పుకునే ఫాల్గుణ మాసాన్ని విష్ణు ప్రీతికరమని భాగవతం పేర్కొంటోంది. చైత్రాది మాసాల క్రమంలో చిట్ట చివరిది ఫాల్గుణం.**

# ఫాల్గుణం.. పయోవ్రతం ఆచరిస్తే అభీష్టసిద్ధి!

చైత్రాది మాసాల క్రమంలో చిట్ట చివరిది ఫాల్గుణం. ఇంతకు ముందు పదకొండు నెలల్లో చేసిన దేవతా పూజలు, వ్రతాలు ఈ మాసంలో ఇంకోసారి కనిపించడం విశేషం. సర్వదేవతా వ్రత సమాహారంగా, సర్వవ్రత సింహావలోకనంగా ఇది కనిపిస్తుంది. ఫాల్గుణం ..విష్ణు ప్రీతికరం అంటోంది భాగవతం. ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి పన్నెండు రోజులు పయోవ్రతం ఆచరించి శ్రీమహావిష్ణువుకి నైవేద్యంగా క్షీరాన్నం సమర్పిస్తే అభీష్టసిద్ధి కలుగుతోందని భాగవత పురాణం వివరిస్తోంది. ఈ పయోవ్రతాన్ని ఆచరించిన అదితి సాక్షాత్తు శ్రీహరినే (వామనుడు) తన పుత్రుడిగా పొందింది. ఫాల్గుణంలో గోదానం, ధనదానం, వస్త్రదానం, గోవిందుడికి ప్రీతి కలిగిస్తాయని శాస్త్రాలు తెలియజేస్తున్నాయి.

వసంత పంచమి నుంచి ఫాల్గుణ పౌర్ణిమ వరకు ప్రకృతి రోజుకో రంగును సంతరించుకుంటుంది. చిలుకలు వాలిన జామచెట్టులా ఉండే ప్రకృతి పంచవన్నెల రామచిలకలా కనువిందు చేస్తుంది. చలి పూర్తిగా తగ్గదు. నులివెచ్చదనం ప్రాణానికి హాయి కలిగిస్తుంటుంది. ఫాల్గుణ బహుళ పాడ్యమినాడే రావణుడితో యుద్ధానికి వానర సేనను వెంటబెట్టుకొని శ్రీరాముడు లంకకు వెళ్లాడు. ఫాల్గుణ బహుళ ఏకాదశినాడు రావణ కుమారుడు ఇంద్రజిత్తు, లక్ష్మణుడు మధ్య ప్రారంభమైన సమరం త్రయోదశి దాకా కొనసాగింది. రావణబ్రహ్మను శ్రీరాముడు అమావాస్య రోజు వధించాడు. అంతేకాదు కురుపాండవుల్లో కొందరు ఫాల్గుణ మాసంలో జన్మించినట్లు చెబుతారు.

హరిహరసుతుడు అయ్యప్పస్వామి, పాలకడలి నుంచి లక్ష్మీదేవి ఇదే మాసంలో జన్మించారు. ఇక మహాత్ములైన శ్రీకృష్ణ చైతన్యులు, రామకృష్ణ పరమహంస, స్వామి దయానంద సరస్వతిలు జననం కూడా ఈ నెలలోనే జరిగింది. అర్జునుడి జన్మ నక్షత్రం కూడా ఇదే కాబట్టి ఫల్గుణ అనే పేరుంది. ఫాల్గుణ బహుళ అష్టమినాడు ధర్మరాజు, ఫాల్గుణ శుద్ధ త్రయోదశి రోజున భీముడు, దుర్యోధనుడు, దుశ్శాసనులు జన్మించినట్లు పురాణాలు తెలుపుతున్నాయి.



ఇక, తెలుగు నెలల్లో చివరిది ఫాల్గుణ మాసం. హోలీ పండుగను ఏటా ఫాల్గుణ పౌర్ణమి రోజున జరుపుకుంటారు. చతుర్దశి నాడు కాముని దహనం అనంతరం ఫాల్గుణ పౌర్ణమి నాడు వచ్చే హోలీ పండుగను భారత్‌లోనే కాకుండా నేపాల్, బంగ్లాదేశ్ దేశాల్లో కూడా వైభవంగా జరుపుకుంటారు. వసంతకాలంలో వచ్చే పండుగ కాబట్టి పూర్వం ఈ పండుగను 'వసంతోత్సవం' పేరిట జరుపుకునేవారు.

ప్రహ్లాదుని చంపబోయిన హిరణ్య కశ్యపుని సోదరి హోలిక తాను దహనమవుతుంది. ఆ రాక్షసి చనిపోయిందనే ఆనందంలో హోలీ పండుగను నిర్వహిస్తారని కొందరంటారు. లోక కల్యాణం కోసం పార్వతీపరమేశ్వరుల వివాహం జరిపించాలని నిర్ణయించిన దేవతలు, గిరిపుత్రికపై పరమశివుడి దృష్టి నిలిచేలా చేయమని మన్మథుడి సాయం కోరారు. దేవతల కోరిక మేరకు శివుడిపైకి మన్మథుడు పూల బాణాన్ని ప్రయోగించి, తపోభంగం చేస్తాడు. దీంతో ఆగ్రహావేశాలకు లోనైన శివుడు మూడో కన్ను తెరిచి ఆయనను భస్మం చేస్తాడు. అలా కోరికలు దహింపజేసిన రోజు కావడం వల్ల ఆ రోజు కామ దహనం పేరుతో మన్మథుడి బొమ్మను గడ్డితో చేసి తగులబెడతారు.

మరో పక్క ఫాల్గుణ శుద్ధ పౌర్ణిమ రోజున కృష్ణ భగవానున్ని ఊయల్లో వేసిన వేడుకకు గుర్తుగా బెంగాల్‌లో డోలికోత్సవాన్ని నిర్వహిస్తారు. శాస్త్రీయ కారణాల ప్రకారం.. వసంత కాలంలో వాతావరణం చలి నుంచి వేడికి మారుతుంది. దీనివల్ల వైరల్ జ్వరం, జలుబు లాంటి వ్యాధులు ప్రబలుతాయి. ఈ సమయంలో కొన్ని ఔషధ మొక్కల నుంచి తయారు చేసిన సహజమైన రంగులు, నీళ్లను శరీరంపై చల్లుకోవడం వల్ల వ్యాధుల తగ్గుముఖం పడతాయనేది మరో వాదన.

### గణపతి స్తోత్రం:

శుక్లాం బరధరం విష్ణుం శశి వర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయే సర్వ విఘ్నోప శాంతయే
అగజానన పద్మార్కం గజానన మహర్నిశం
అనేక దంతం భక్తానాం ఏకదంతం ఉపాస్మహే.

వక్రతుండ మహాకాయ కోటి సూర్య సమప్రభ
నిర్విఘ్నం కురుమేదేవ సర్వకార్యేషు సర్వదా

# మీ రహస్యాలను ఎవరితో చెప్పకూడదు, ఎందుకంటే?

జీవితంలోని ప్రతి మలుపులోను మహాభారతం అందరికీ స్ఫూర్తిదాయకంగా, ఆదర్శంగా ఉంటుంది. ఈ మహాభారత ఇతిహాసంలో ఉపదేశించిన పరిస్థితులు, సంఘటనలు ప్రతి ఒక్కరి జీవితంలో ఏదో ఒకరోజున, ఏదో ఒక రూపాన తారసపడుతూనే ఉంటాయి. ప్రజల మన స్థితి, ఒకరిని అర్థం చేసుకునే విధానం, ఎదుటి వ్యక్తిని అంచనా వేయడం, నిర్ణయాలు తీసుకోవడం వంటి అనేక విషయాలలో మహాభారతం ఎందరికో ఆదర్శప్రాయం. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న మహాభారతంలో సుమారుగా 100,000 శ్లోకాలను కలిగి ఉండి అతిపెద్ద ఇతిహాసంగా చెప్పబడుతుంది. క్రమంగా 100,000 కన్నా అధికంగా సూచనలను కలిగి ఉంటుంది. కానీ వీటిలోని అంతరార్థాన్ని లోతుగా పరిశీలించగలిగే వారు మాత్రం తక్కువ.

అలా ఒక శ్లోకం గురించి వివరాలలోకి వెళ్తే, మీ రహస్యాలను ఎవరితో చెప్పకూడదు అన్న ప్రశ్నకు సమాధానం లభిస్తుంది. అదేమిటో చూద్దాం.

**శ్లోకం : స్త్రీయం ముదేన్ బాలెన్ లబ్దేన్ లఘుపని వా!**

**న మంత్రాయిత్ గుహ్యాని యేషు చోన్మాడ్ లక్షణం !!**

**అర్థం:** ఈ శ్లోకంలో ప్రధానంగా ఆరుమంది వ్యక్తుల గురించి వివరించడం జరిగింది. ఈ ఆరుమంది వ్యక్తులతో మన రహస్యాలను పంచుకోరాదు అని ప్రధానంగా చెప్పబడుతుంది. వారు వరుసగా స్త్రీ, పిల్లవాడు, మూర్ఖుడు, పిచ్చి లేదా వెర్రి ఉన్న వ్యక్తి, అత్యాశాపరుడు మరియు దుష్టుడు. ఈ ఆరుమందికి సంబంధించిన వివరణ కింద ఇవ్వబడింది. మహాభారతం ప్రకారం ఈ క్రింద చెప్పబడిన వ్యక్తులకు మీ రహస్యాలను ఎట్టిపరిస్థితుల్లోనూ చెప్పకండి

**మూర్ఖుడు లేదా పిచ్చివాడు:** సమయం, ప్రదేశం, సందర్భం అనే కనీస భావన లేకుండా ప్రవర్తించే వ్యక్తులను మూర్ఖులుగా గుర్తించడం జరుగుతుంది. ఇటువంటి వ్యక్తులతో వ్యవహరించడం, పూర్తిగా అసురక్షితమనే చెప్పాలి. వీరి విపరీత ధోరణుల కారణంగా, అనాలోచితంగా రహస్యాలను నలుగురికీ చెప్పేసే ప్రమాదం ఉంది. ఇటువంటి చర్యలు, ప్రాణాల మీదకు కూడా తీసుకుని రాగలవు. పైగా పొరపాటు చేశామన్న భావన వచ్చినప్పుడు మీ ఒక్కరికే చెప్తున్నాము, ఎవరితో ఈ రహస్యం చెప్పకండి అంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తుంటారు. అదేవిధంగా ఒక పిచ్చి వానికి తెలిసిన ఎడల, అసందర్భంగా అరిచి చెప్పే అవకాశాలు కూడా లేకపోలేదు. కావున మూర్ఖులకు, పిచ్చి వారికి రహస్యాలు ఎట్టిపరిస్థితుల్లో తెలియనివ్వకూడదు.

**స్త్రీలు:** ఆయాకాలాల ప్రకారం, వారి వారి ఉద్దేశాల ప్రకారం స్త్రీల పరంగా కొంత వ్యతిరేక భావనలు ఉండేవి అన్నమాట వాస్తవం. క్రమంగా కొన్ని కీలకమైన విషయాలను స్త్రీలకు చెప్పడం ద్వారా ప్రపంచానికి తెలియజేసినట్లుగా భావించేవారు. ధర్మరాజు కూడా కర్ణుని విషయం దాచినందుకు కుంతీ దేవిని ఉద్దేశించి, మహిళల నోట మాట దాగదు అన్న శాపం ఇచ్చినట్లుగా మహాభారతంలో రాసి ఉందని చెప్పబడుతుంది. కానీ కాలానుగుణంగా మారిన పరిస్థితుల దృష్ట్యా మహిళలు పురుషులతో సమానంగా ఇంటి బాధ్యతలను తీసుకుంటున్నారు అన్నది నిజం. క్రమంగా గోప్యత కూడా వీరి ఆలోచనల్లో భాగమైపోయింది. నిజానికి స్త్రీ ఎప్పుడూ కుటుంబ సంక్షేమం దృష్ట్యానే మాట్లాడుతుంది. కానీ ఎందుకని అంత వివక్షను ప్రదర్శించేవారో ఇప్పటికీ ఒక ప్రశ్నగానే ఉంది.

**చిన్న పిల్లవాడు:** చిన్న పిల్లలకు సరైన అవగాహన, తెలివి, ఆలోచించే నేర్పు ఉండవు. క్రమంగా అనాలోచితంగా ఎవరు ఏం అడిగినా, తమకు తెలిసింది చెప్పేయాలన్న కుతూహలాన్ని కలిగి ఉంటారు. కావున రహస్యాల పరంగా వీరికి కాస్త దూరంగా ఉండడమే మంచిది. ముఖ్యంగా చిన్న పిల్లల ముందు ఎట్టిపరిస్థితుల్లోనూ ఒకరి గురించి చెడుగా చెప్పరాదు. అది మీ ఉనికికే కాకుండా, వారి ఆలోచనా విధానాల్లో కూడా పెనుమార్పులు తీసుకుని వచ్చే అవకాశాలు ఉన్నాయి. పరిస్థితులను అర్థం చేసుకునే నేర్పును పెద్దలు అందివ్వగలగాలి, క్రమంగా వారే వ్యక్తుల పట్ల ఒక అవగాహనకు వస్తుంటారు.

**అత్యాశాపరుడు దుష్టుడు:** అత్యాశాపరుడు తన బలహీనతను బలంగా మార్చుకోవాలన్న దురాశను కలిగి ఉంటాడు. క్రమంగా ఇతరుల కష్టాలను తమకు అనుకూలంగా మరియు లాభంగా మార్చుకునే ప్రయత్నం చేస్తుంటాడు. ఒక్కోసారి లాభాల కోసం వంచనకి పాల్పడే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ ఇటువంటి అత్యాశాపరుడు మీ స్నేహితులలో ఉంటే, వీరికి దూరంగా ఉండడం మేలు., లేదా వీరి వద్ద ఎటువంటి వ్యక్తిగత విషయాల గురించిన చర్చలు చేయరాదని గుర్తుంచుకోండి. వీరు విషయాలను గోప్యంగా ఉంచుతారన్న భరోసా ఉండదు. పైగా మీ బలహీనత తెలిసిన తర్వాత, మీకు చేసిన వాగ్దానాలన్నిటిని మర్చిపోయి, నోటికి పనిచెప్తూ ఉంటారు. మీకు ఉండే కష్టాలు చాలవన్నట్లు, సరికొత్త కష్టం జోడవుతుంది వీరి రూపంలో. ఇక దుష్టుడు తమ స్వార్థపూరిత ఉద్దేశాలకు ఎప్పుడైనా మిమ్మలను ఉపయోగించుకునే ప్రయత్నం చేయవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే బ్లాక్మెయిల్ రాజకీయాలకు పాల్పడవచ్చు.



# జీయర్ స్వామివారి తిరుప్పావై యజ్ఞం సన్నిధి

రెండు తెలుగు రాష్ట్రాలలో ముఖ్యంగా భాగ్యనగరంలో శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి అధ్వర్యాన తిరుప్పావై యజ్ఞం ప్రతి ధనుర్మాసంలోనూ అద్భుతంగా సాగుతూ ఉంటుంది. తిరుప్పావై అంటే శ్రీ నోము అని సిరినోము అని అర్థం. విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని నమ్మే శ్రీవైష్ణవ మతానువర్తులు ఏటేటా అనుసరించే ఈ వ్రతాన్ని కాత్యాయనీ వ్రతం అని కూడా అంటారు. పన్నెండుగురు వైష్ణవ ఆళ్వార్ (భగవత్ దార్శనికులు, దారి చూపిన వారు) లలో ఏకైక స్త్రీమూర్తి గోదాదేవి. తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూర్ వటపత్రశాయి ఆలయంలో పెరియాళ్వార్ పెంచిన తులసితోటలో దొరికిన పాప గోదాదేవి. ఆయన మనసులో ఎప్పుడికీ విష్ణువే కనుక విష్ణుచిత్తుడనే పేరు వచ్చింది. గోదాదేవి తండ్రి పెంపకంలో పరమభక్తురాలిగా ఎదిగింది.

ఆమె రచించిన ముప్పయ్ తమిళ పాశురాలు (ఎనిమిది పాదాల పద్యాలు)– నాలుగు వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, భాగవత గ్రంథాల సారాంశాన్ని రంగరించినవి. నిష్కల్మషమైన భక్తిని అక్షరక్షరంలో ప్రత్యక్షం చేసే గోవింద గీతా ప్రబంధం తిరుప్పావై అని త్రిదండి రామానుజ చిన జీ యర్ స్వామి వివరిస్తున్నారు. ఈసారి ధనుర్మాసోత్సవాన్ని ఆధ్యాత్మికులు శ్రీ రామేశ్వరరావు నివాస గృహంలో ఉదయం, సాయంత్రం జీయర్ స్వామి స్వయంగా తిరుప్పావై పాశురాన్ని అందరిచేత చదివించి ఆ పాశుర ప్రతిపదార్థాన్ని, సారాంశాన్ని విశేష అర్థాన్ని వివరిస్తూ నెలరోజులుగా నిర్వహిస్తున్నారు. అలతి పదాలలో అపురూపమైన అర్థాన్ని సామాన్యులకు సైతం అవగాహన అయ్యే విధంగా సంస్కృత, తమిళ, తెలుగు, ఆంగ్ల భాషలలో జీయర్ స్వామి ప్రబోధిస్తున్నారు.



ప్రత్యక్ష ప్రసారాల ద్వారా లక్షలాది మంది వింటున్నారు, చూస్తున్నారు.గోదాదేవికి విల్లిపుత్తూరే రేపల్లె. చెలులే గోపికలు. కావేరీ నది యమున. వటపత్రశాయే క్రిష్ణయ్య. గోపికలను తెల్లవారుజామునే నిద్ర లేపి, నందగోప రాజు ఇంట నందకిశోరుడైన శ్రీ కృష్ణుని లేచి రమ్మని, నడిచి వస్తే ఆ నడకను వర్ణించి, సింహాసనంపై ఆసీనుడు కాగానే మంగళహారతులు పాడి, తమ వ్రత విధానం, సాధనం, గమ్యం లక్ష్యం అన్నీ నారాయణుడే అని విన్నవించి, తమకు ఏమీ తెలియదని, భక్తి అంటే ఏమిటో కూడా అర్థం కాదని, అయినా అందరితో కలిసి మిమ్మల్ని ప్రార్థిస్తున్నామని, మాకేం కావాలో మీరే నిర్ణయించి మీ బంధువులుగా మమ్ము భావించి ఆ సంబంధంతో మాకు ఆనందాన్నివ్వాలని, కనుక మిమ్మల్నే మేము కోరుకుంటున్నామని గోపికలద్వారా గోవిందునికి విన్నవించడమే తిరుప్పావై అని జీయర్ స్వామి అరటి పండు ఒలిచి పెట్టినంత సులభంగా విప్పి చెప్పారు.

## ఇస్లాం వెలుగు

# నా ప్రభువే కాపాడాడు

హజ్రత్ అబ్దుల్ ఖాదర్ జీలానీ రహ్మతుల్లాహ్ అలైహ్ గొప్పదైవభక్తుడు. అనునిత్యం దైవధ్యానంలో నిమగ్నమై ఉంటూ, ప్రజలకు ధార్మికబోధ చేస్తూ ఉండేవారు. ఒకనాటి రాత్రి ఆయన యధాతథంగా దైవారాధనలో నిమగ్నమై ఉన్నారు. అంతలో ఒక మహోజ్వలమైన వెలుగు కనిపించింది . హజ్రత్ అబ్దుల్ ఖాదర్ జీలానీ రహ్మ బయటికి వెళ్ళి చూశారు. ఆకాశం వైపునుండి ఒక సింహాసనం జాజ్వల్యమానంగా వెలుగులు విరజిమ్ముతూ భూమ్మీదకు దూసుకువస్తోంది. అసలు అది ఏమిటో కూడా చూడలేనంత వెలుగు భూమండలంపై పరచుకుంటోంది. అంతలో 'అబ్దుల్ ఖాదర్ జీలానీ..! మేము నీ దైవభక్తిని, నీ ఆరాధనను మెచ్చుకున్నాము. ఇకనుండి ఇతరులకు ధర్మబద్ధం కానివి నీకు ధర్మబద్ధం చేశాము. అంటే హరాం విషయాలను నీకు హలాల్ గా చేశాము.' అన్న అదృశ్యవాణి వినిపించింది.అప్పుడు హజ్రత్ జీలానీ రహ్మ, 'హరామ్ వస్తువులు హలాల్ చేయడం ఎవరికి సాధ్యం? ఇదేమైనా షైతాన్ పన్నాగం కాదు కదా..?' అని ఆలోచిస్తూ..,' ఇంతకూ నువ్వు ఎవరివి? దైవానివా. సృష్టికర్తవా..?'అని ప్రశ్నించారు.ఈ ప్రశ్నకు అటువైపునుండి ఎటువంటి సమాధానమూ రాలేదు. నేను దేవుణ్ణి అని చెప్పే ధైర్యం షైతాన్ కులేదు.

వాడు నేనే దైవాన్ని అని చెప్పలేదు. మౌనమే సమాధానమైంది. వెంటనే ఆయన, ఇదంతా షైతాన్ కల్పించిన భ్రమ మాత్రమే.. అని పసిగట్టి,'శాపగ్రస్తుడా..దుర్మార్గుడా..దూరంగా పారిపో..' అంటూ.. అల్లాహ్ శరణు వేడుకున్నారు.అప్పుడు షైతాన్ మరోపాచిక విసురుతూ..'జీలానీ . నిన్ను నీ జ్ఞానం కాపాడింది.' అని పలికాడు. 'కాదు.. కాదు.. నా జ్ఞానం కాదు.. నాప్రభువు కాపాడాడు.'



అన్నారు హజ్రత్ జీలానీ రహ్మ వెంటనే.. ఈ విధంగా షైతాన్ చివరి అస్త్రం కూడా పనిచేయకుండా పోయింది.దీనివల్ల మనకు అర్థమయ్యేదేమిటంటే, మనమేదో దైవభక్తులమని, దానధర్మాలు చేస్తుంటామని, ఇతరసత్కార్యాలెన్నో చేస్తూ ఉంటామని, విద్యావిజ్ఞానాలు ఉన్నాయని, అందరికంటే నాలుగాకులు ఎక్కువే చదివామని ఎవ్వరూ భ్రమపడకూడదు. అంతా దైవానుగ్రహమని మాత్రమే భావించాలి తప్ప దైవభక్తిపరులమని ప్రత్యేకతలు ఆపాదించుకొని గర్వించకూడదు.

## మాసం మహత్యం

పుణ్యఫలాలనిచ్చే పుష్యం: పుష్యమీ నక్షత్రం పౌర్ణమినాడు చంద్రునితో కూడి ఉన్న మాసం పుష్యమాసం. చాంద్రమాన ప్రకారం సంవత్సరంలో ఇది పదోమాసం. దేవతలతో పాటు, పితృదేవతలనీ ఆరాధించడం ఈ మాసం ప్రత్యేకం. పుష్యమి అనేది శనిగ్రహ నక్షత్రం. ఈ నక్షత్రానికి అధిదేవత బృహస్పతి బుద్ధి కారకుడు కావడం వల్ల ఈ మాసం బృహస్పతికీ, శనికీ అత్యంత ప్రీతికరమైనది. శనికి ఇష్టమైన పదార్థం నువ్వులు, వాటి నుంచి వచ్చే నూనె. కాబట్టి ఈ మాసంలో నువ్వులు, నువ్వులనూనెతో ఆయనను అభిషేకించి, పూజించాలని, నువ్వులు దానం చేయాలని, బెల్లంతో కలిపిన నువ్వులు తినాలని శాస్త్రవచనం. అలాగే ఇది మంచు కప్పబడి ఉండే మాసం కాబట్టి పగటి సమయం తక్కువ, రాత్రి సమయం ఎక్కువ.

ఆ కొద్దిసేపైనా ఎండతీక్షణత ఉండదు. సూర్యరశ్మి శరీరానికి తగినంత అందదు. అందువల్ల తైలగ్రంథులు వాటి విధిని సక్రమంగా నిర్వహించలేక మందగిస్తాయి. ఫలితంగా చర్మం పొడిబారి, పగుళ్లు ఏర్పడతాయి. దీనికి నివారణ నువ్వుల నూనె ఒంటికి పట్టించి నలుగు పెట్టుకుని స్నానం చేయడం. అలాగే సంక్రాంతి పిండి వంటలన్నిటిలో నువ్వులు, బెల్లం తప్పకుండా ఉంటాయి, ఉండాలి కూడా. ఇక ఈ మాసం శూన్య మాసం అని అందరూ ఆడిపోసుకుంటారు కానీ, అత్యుత్తమమైన ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేదీ, రైతులు పండుగగా, పితృదేవతల పండగగా చెప్పుకునే సంక్రాంతి పండగ వచ్చేది కూడా ఈ మాసంలోనే కాబట్టి చిన్న చూపు తగదు.



# ఆనాటి సీన్ ఇప్పటికీ గుర్తుంది

### బాహుబలి నిర్మాణంపై రాజమౌళి

బాహుబలి రెండు పార్టులను కలిపి ఒకే సినిమాగా తీసుకువస్తున్న క్రమంలో ఈ రీ రిలీజ్ సినిమాకు భారీ క్రేజ్ వస్తోంది. రెండు పార్టులను కలపడంతో పాటు కొన్ని కొత్త సీన్లను కూడా యాడ్ చేసినట్టు తెలుస్తోంది. ఇక మూవీని ప్రమోట్ చేయడానికి రాజమౌళి, ప్రభాస్, రానా రెడీ అయిపోయారు. ఈ ముగ్గురూ కలిసి తాజాగా ఓ ఇంటర్వ్యూలో సందడి చేశారు. బాహుబలి సమయంలోని చాలా విషయాలను పంచుకున్నారు. తాజాగా ఇందుకు సంబంధించిన ప్రోమోను రిలీజ్ చేశారు. ఇందులో ప్రభాస్ మాట్లాడుతూ.. పదేళ్లు అవుతోంది కదా.. మీకెలా అనిపిస్తోందని అడిగాడు. తనకు ఇప్పటికీ కొన్ని సీన్లు అలాగే మైండ్ లో ఉండిపోయాయని తెలిపాడు జక్కన్న. మరీ ముఖ్యంగా కట్టప్ప బాహుబలిని చంపడానికి కత్తి పట్టుకున్న టైమ్ లో ఇచ్చిన ఎక్స్ ప్రెషన్లు ఇప్పటికీ తన మైండ్ లో ఉండిపోయాయన్నాడు. అలాగే భళ్లాల దేవుడి విగ్రహాన్ని పైకి లేపే సమయంలో చేతులు వణికాయంటూ ప్రభాస్ గుర్తు చేసుకున్నాడు. ఇక ప్రభాస్ సభలో తల నరికే సీన్ గురించి కూడా మాట్లాడుకున్నారు. ఆ సీన్ మూడో రోజు ప్రభాస్ తల నరుకుతాడని రానా గుర్తు చేశాడు. అవును అది ఆ సీన్ లో చాలా బాగుంటుంది అన్నాడు రాజమౌళి. అవును అది మాట్లాడుకోవడానికి బాగుంది కానీ అంటూ ప్రభాస్ అన్నాడు. అంతకు మించి ప్రోమోలో చూపించలేదు. ముగ్గురూ ఇందులో సరదాగా మాట్లాడుకున్నారు. ఈ ఇంటర్వ్యూ బ్లాస్ట్ కావడం ఖాయం అంటున్నారు ఫ్యాన్స్. 'బాహుబలి: ది ఎపిక్' టైటిల్‌తో ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రభాస్, రానా స్పెషల్ ఇంటర్వ్యూలో సందడి చేశారు. షూటింగ్ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఓ కీలక సన్నివేశం గురించి రాజమౌళి ప్రస్తావించగా.. 'ఇప్పుడు బాగానే ఉంది. కానీ, అప్పుడు..' అంటూ ప్రభాస్ నవ్వులు పూయించారు. తాజాగా ప్రోమో విడుదలైంది. పూర్తి వీడియో త్వరలోనే రిలీజ్ కానుంది.



# గెస్ట్ రోల్‌ను తిరస్కరించిన వంగా

నేషనల్ క్రష్ రశ్మికా మందణ్ణ నటించిన హిందీ మూవీ 'థామా'వంద కోట్ల క్లబ్ లో చేరింది. మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ బ్యానర్ నుండి ఇటీవల కాలంలో వచ్చిన సూపర్ హిట్ చిత్రాల సరసన ఇది చేరకపోయినా... రశ్మిక అభిమానులు మాత్రం ఆమె పోషించిన బేతాళు రాలి పాత్ర కొత్తగా ఉందని ఆనందిస్తున్నారు. ఇదిలా ఉంటే... రశ్మిక నటించిన మరో చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్' నవంబర్ 7న పాన్ ఇండియా స్థాయిలో జనం ముందుకు రాబోతోంది. దీన్ని అల్లు అరవింద్ సమర్పణలో నిర్మించారు. నటుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఓ కీలక పాత్రను చేయమని ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగను అడిగారట. ఈ విషయం గురించి దర్శకుడు రాహుల్ ఇటీవల మాట్లాడుతూ, 'ఈ సినిమాలో అతిథి పాత్రను మించిన ఓ కీలకమైన పాత్ర ఒకటి ఉంది. అది సందీప్ రెడ్డి వంగ చేస్తే కొత్తగా ఉంటుందనిపించింది.

ఆయనలో మంచి నటుడు కూడా ఉన్నాడని నా నమ్మకం. అదే ధైర్యంతో ఆయన్ని అప్రోచ్ అయ్యాను. అయితే సందీప్ ఈ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించాడట. అతిథి పాత్రలో సరదాగా ఒకటి రెండు సీన్స్ అంటే ఓకే కానీ... నాలుగైదు సీన్స్ చేయడం కష్టమే' అని చెప్పేశాడట. దాంతో రాహుల్ రవీంద్రన్ ఆ పాత్ర చేయమని ప్రముఖ నటుడు 'వెన్నెల' కిశోర్ ను కోరాడట. ఎందుకంటే... 'వెన్నెల' కిశోర్, రాహుల్ రవీంద్రన్ మధ్య మంచి స్నేహం ఉంది. మామూలుగా అయితే రాహుల్ రవీంద్రన్ మాటను 'వెన్నెల' కిశోర్ ఎప్పుడూ కాదని చెప్పడు. కానీ ఆ పాత్రకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని, కమెడియన్ ఇమేజ్ ఉన్న తాను అలాంటి సీరియస్ పాత్ర చేస్తే జనం యాక్సెప్ట్ చేయరని కిశోర్ స్పష్టం చేశాడట. దాంతో ఇక గత్యంతరం లేక తానే ఆ పాత్రను చేశానని రాహుల్ తెలిపాడు. ఇటీవల వచ్చిన 'ది గర్ల్ ఫ్రెండ్' ట్రైలర్ లో రాహుల్ రవీంద్రన్ కనిపించాడు. నిజానికి తాను మల్టిపుల్ టాస్క్స్ చేయలేనని, అందుకే దర్శకత్వం, నటన ఒకేసారి చేయడం ఇష్టముండేది కాదని రాహుల్ రవీంద్రన్ తెలిపాడు. తాను గతంలో దర్శకత్వం వహించిన 'చి.లా.సౌ.', 'మన్మధుడు -2' చిత్రాలలో అందుకే నటించలేదని తెలిపాడు. కానీ ఈ సినిమాలో మాత్రం ఆ పాత్ర చేయకతప్పలేదని అన్నాడు. నిజానికి రాహుల్ ఫస్ట్ ఛాయిస్ అయిన సందీప్ రెడ్డి వంగా ఈ పాత్రను చేసి ఉంటే... సినిమాకు ఖచ్చితంగా ప్లస్ అయ్యి ఉండేది. ఎందుకంటే... 'పుష్ప' సినిమా తర్వాత హిందీలో రష్మికా మందణ్ణకు మళ్ళీ ఆ రేంజ్ హిట్ ఇచ్చిన సినిమా 'యానిమల్'. దాని దర్శకుడు సందీప్ రెడ్డి వంగ, రశ్మిక స్క్రీన్ షేర్ చేసుకుని ఉంటే... ఖచ్చితంగా అది ఉత్తరాది ఆడియెన్స్ లోనూ క్యూరియాసిటీ క్రియేట్ చేసి ఉండేది.



## మన శంకర్ వరప్రసాద్ గారు

# హాట్ కేకులా బిజినెస్ పార్ట్ పూర్తి

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం 'మన శంకర్ వరప్రసాద్ గారు' అనే సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాని అత్యంత ప్రతిష్టాత్మకంగా మెగాస్టార్ చిరంజీవి కుమార్తె సుష్మితతో పాటు సాహు గారపాటి కూడా నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా రిలీజ్ ప్లాన్ చేయబడిన ఈ సినిమా అనౌన్స్ చేసిన నాటి నుంచి భారీ అంచనాలు ఉన్నాయి. దానికి కారణం అనిల్ రావిపూడి కామెడీ టైమింగ్ అనే చెప్పాలి. ఎందుకంటే, గతంలో ఆయన చేసిన అన్ని సినిమాలు కామెడీ టైమింగ్‌తోనే వర్కౌట్ అయ్యాయి. దానికి తోడు, చివరిగా ఆయన చేసిన విక్టరీ వెంకటేష్ సినిమా, సంక్రాంతికి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఏకంగా 300 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టింది. ఈ నేపథ్యంలో, మెగాస్టార్ టైమింగ్‌తో పాటు అనిల్ రావిపూడి కామెడీ టైమింగ్ కూడా సింక్ అయితే, ఈ సినిమాని ఆపేవారే లేరని ప్రచారం. ఈ నేపథ్యంలో సినిమా బిజినెస్ కూడా హాట్ కేకులా పూర్తయినట్లుగా సమాచారం. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ సినిమా నాన్ థియేట్రికల్ రైట్స్ తోనే సినిమా బడ్జెట్ అంతా కవర్ అయిపోయినట్లుగా తెలుస్తోంది. ఈ మధ్యకాలంలో సినిమాల నాన్ థియేటర్ బిజినెస్ గాలిలో దీపంలా మారిపోతున్న తరుణంలో, ఏకంగా షూటింగ్ దశలో ఉండగానే నాన్ థియేట్రికల్ పూర్తి చేసుకోవడం అనేది ఒక ఆసక్తికరమైన పరిణామం అనే చెప్పాలి. ఈ సినిమా డిజిటల్ రైట్స్ జీ సంస్థ దక్కించుకున్నట్లుగా సమాచారం. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రంగం సిద్ధమవుతోంది.

# బాహుబలిలో కొత్త సన్నివేశాలు యాడ్

### సినిమాటో గ్రాఫర్ సెంథిల్ కుమార్

భారతీయ సినీ చరిత్రలో సరికొత్త రికార్డులు సృష్టించిన 'బాహుబలి' మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఒకే మూవీగా 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ సినిమా షూటింగ్ జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటూ.. పలు ఆసక్తికర విశేషాలు



పంచుకున్నారు. బాహుబలి' రెండు భాగాల్లోని కొన్ని సన్నివేశాలను కట్ చేసి 'బాహబలి: ది ఎపిక్'ను తీసుకొస్తున్నాం. ఎమోషన్ మిస్ కాకుండా ఉండేందుకు ఒక కొత్త సన్నివేశం యాడ్ చేశాం. కొత్తగా చిత్రీకరించిన సీన్ కాదు. అప్పుడు ఎడిటింగ్‌లో తీసేసిన సీన్ ఇప్పుడు ఉపయోగపడుతోంది. నేటి ట్రెండ్‌కు తగ్గట్టు కలర్ గ్రేడింగ్ మార్చాం అని అన్నారు. రాజమౌళి 'ఈగ' సినిమా తర్వాత బాహుబలి ఆలోచన చెప్పారు. ఇది విజువల్ వండర్ అని అప్పుడే నాకు అర్థమైంది. ఎలాంటి విజువల్స్ ఉంటే బాగుంటుందన్న కోణంలో కొంత రీసెర్చ్ చేశా. నిర్మాత శోభు యార్లగడ్డ, రాజమౌళిని ఒప్పించి మరీ ఈ సినిమాని డిజిటల్ కెమెరాలో షూట్ చేశా. ఈ సినిమా విషయంలో నేను తీసుకున్న కీలక నిర్ణయమదే. చాలా పెద్ద ప్రాజెక్టు కావడం, ఆ టెక్నాలజీ కొత్త కావడంతో వర్కౌట్ అవుతుందో లేదోనని వాళ్లు కాస్త టెన్షన్ పడ్డారు. రాజద్రోహి పారిపోతుంటే.. ప్రభాస్, రానా పట్టుకునే సీన్‌ను తొలుత ఓ ప్రాంతంలో షూట్ చేశాం. తర్వాత షాట్ తీస్తుండగా.. చుట్టూ వేలమంది ప్రజలు కనిపించారు. కెమెరాను ఎక్కడ పెట్టినా అందులో వాళ్లే కనిపించేవారు. అంతమంది జనంలో మేం షూటింగ్ చేయలేక ఆ షెడ్యూల్ ఆపేశాం. మరుసటి రోజూ అదే పరిస్థితి. అందుకే ఈ సినిమాని బయట షూట్ చేయకుండా రామోజీ ఫిల్మ్ సిటీలో చేశా తెలిపారు.

# బాబీ కొల్లి చిరు కాంబినేషన్‌లో మెగా 158

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం పలు భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ఆయన లైన్‌లో ఉన్న అత్యంత ఆసక్తికర చిత్రాల్లో ఒకటి దర్శకుడు బాబీ కొల్లి (కె.ఎస్. రవీంద్ర) దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం. చిరు జన్మదినం సందర్భంగా ఈ సినిమాను ప్రకటించడంతో మెగా ఫ్యాన్స్‌లో భారీ ఎజగైట్‌మెంట్ నెలకొంది. 'వాల్తేరు వీరయ్య' విజయానంతరం బాబీ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం మరో సూపర్ హిట్ అవుతుందనే నమ్మకం అభిమానుల్లో ఉంది. ఇప్పటికే విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్ 'బ్లడీ బెంచ్‌మార్క్ సెట్ చేసిన బ్లేడ్' అనే ట్యాగ్‌లైన్‌తో మెగా మాస్ హిస్టీరియాను పెంచింది. రక్తంతో తడిసిన చిలుక ఆకారం, గొడ్డలి డిజైన్ చూసి ఇది రస్టిక్ మాస్ యాక్షన్ డ్రామా అని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఇక ఈ సినిమాలో చిరంజీవితో పాటు మరో స్టార్ హీరో కూడా కీలక పాత్రలో నటించబోతున్నారని సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం, కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ ఈ సినిమాలో భాగమవుతున్నాడని తమిళ వర్గాలు పేర్కొన్నాయి. ఇది కేవలం గెస్ట్ రోల్ కాదు, ఫుల్ లెంగ్త్ పవర్‌ఫుల్ క్యారెక్టర్ అని టాక్. చిరు కార్తీ స్క్రీన్ షేర్ చేస్తారన్న ఈ వార్త మెగా ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ప్రస్తుతం ఈ మూవీ ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది. మలయాళ బ్యూటీ మాళవికా మోహనన్ హీరోయిన్‌గా నటిస్తారని వార్తలు వస్తున్నాయి. ఇక బాలీవుడ్ యాక్టర్-డైరెక్టర్ అనురాగ్ కశ్యప్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారని టాక్.సంగీతాన్ని ఎస్. థమన్ అందించనున్నారు. ఇటీవలే ఆయన ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని ధృవీకరించారు. 'మెగా 158' చిత్రాన్ని 2027 సంక్రాంతికి విడుదల చేసేలా షూటింగ్ షెడ్యూల్‌ను ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.త్వరలోనే ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, నటీనటుల జాబితా అధికారికంగా వెల్లడించనున్నట్లు చిత్ర బృందం తెలిపింది.



PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154